నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

శనివారం 7 మార్చి 2026

పేజీలు 11

వామ్మో.. దొంగలు

వరుస దొంగతనాలతో భయపడుతున్న పట్టణవాసులు

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దోపిడీ

నాయుడుపేట, మేజర్‌న్యూస్:

ఎప్పుడు వస్తారో, ఎటు నుంచి వస్తారో తెలియదు. తాళమేసిన ఇంటిని ఎలా కొల్లగొడుతున్నారో అర్థం కాదు. సినిమా రేంజ్లో ప్లాన్ చేసి అందినకాడికి దోచుకుంటున్నారు దొంగలు. నాయుడుపేటలో ఇటీవల వరుసగా దొంగతనాలు పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దొంగతనాల ముఠా దిగిందేమోనన్న సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. వరుస దొంగతనాలు జనం కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. నాయుడుపేటలో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు రాత్రి తేడా లేదుతాళం వేసి ఎటైనా బయటకు వెళ్లారా? అంతే సంగతులు. ఆ ఇంటికి కన్నం వేసేస్తున్నారు. ఇటీవల పట్టణంలో కొన్ని చోట్ల వరుస దొంగతనాలు జరిగాయంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నాయుడుపేటలో వరస దొంగతనాలతో పట్టణ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వరుస దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిందితులు వేటలో పోలీసులు ఉండగానే కొత్తచోరీ ఘటనలు ప్రజలను భయపెడుతున్నాయి. నాయుడుపేట పట్టణశివారు ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువగా ఉన్నాయి. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగాతాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని. రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ చేస్తున్న దొంగతనాలు మాత్రం ఆగడంలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలు జనం ఆందోళనకు గురవుతున్నారు. దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. ఇంటికి తాళం వేసి ఎదైనా ఊరికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో వస్తువులు దోపిడీకి గురవుతున్నాయి. ఇలా వరుస దొంగతనాలతో జనం ఊరెళ్లాలన్నా

మిగతా 2లో

జనగణన దేశనిర్మాణంలో అత్యంత కీలకం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:

జన గణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, శుక్రవారం సీతమ్స్ కళాశాల నందు సమావేశ మందిరంలో జనగణన శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల ఆరో తేదీ నుండి 8 తేదీ వరకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిఆర్ఓ మోహన్ కుమార్, ఏడి సుప్రజ, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు. జిలా కలెకర్ మాటాడుతూ జనగణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతిఒక్క వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించడం అవసరమన్నారు. జనగణన ద్వారా సేకరించే ప్రతి సమాచారం దేశం, రాష్ట్రం, జిల్లా గ్రామ అభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యమైనదన్నారు. ఒక రాష్ట్రం లేదా దేశం అభివృద్ధిని అంచనా వేయడానికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయమైన ఆధారం జనగణన మాత్రమేనన్నారు. అక్షరాస్యతరేటు, లింగ నిష్పత్తి, జనాభా సంఖ్య వంటి కీలక అంశాలు అన్నీ జన గణన ఆధారంగానే నిర్ణయించబడతాయని ప్రతి ఎన్యూమరేటర్ సేకరించే సమాచారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. జనగణన ప్రక్రియ1872సంవత్సరం నుంచి కొనసాగుతుండగా ఇప్పటి వరకు అనేక సార్లు నిర్వహించబడిందని, ప్రతి దశలోనూ దేశ ప్రణాళికలు రూపొందించ డంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే

మిగతా 2లో

8 లో

టీటీడీ ఈఓగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

ముద్దాడ రవిచంద్ర శ్రీవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు టీటీడీ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు.

తిరుమల, మేజర్‌న్యూస్

గ్రంథాలయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పాఠకులు పెంపుకు సిబ్బంది కృషి చేయాలి

నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు రూ.33.87 కోట్లు బకాయిలు

అధికారులతో కలిసి చెస్ వసూళ్లకు కృషి చేయాలని గ్రంథాలయ చైర్మన్ దిశా నిర్దేశం

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: జిల్లాలోని గ్రంథాలయల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దశగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సమస్త చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి స్పష్టం చేశారు. అన్నమయ్య సర్కిల్లోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఉద్యోగులు, బీడీసీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఎందుకు నిదర్శనం ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గ్రంథాలయాలలో పిల్లలు పుస్తక పఠనం వైపు మొగ్గు చూపాలని చెప్పడం నిదర్శనం అన్నారు. తన కుమారుడు దేవాన్ష్ ప్రతి రోజు ఒక పుస్తకంను చదివిస్తున్నారని విషయాన్ని గుర్తు చేశారు. గ్రంథాలయాల పట్ల వారికి ఉన్న

మిగతా 2లో

'ఉద్యమి'పై ఆసక్తి చూపుతున్న యువత

యువతకు రాజకీయాల్లో ఎదిగే అవకాశం

తిరుపతిలో 25వేలకు పైగా సభ్యత్వం చేయడమే లక్ష్యం

సభ్యత్వం తీసుకున్న ఒక్కొక్కరికి ఐదు లక్షల ప్రమాద భీమా

రెన్యువల్ స్కీం కూడా ప్రత్యేక దృష్టి

50 డివిజన్లలో డోర్ టు డోర్ తిరుగుతున్న జనసైనికులు

జనసేన పార్టీ నగర అధ్యక్షులు రాజారెడ్డి



తిరుపతి, మేజర్‌న్యూస్: జనసేన పార్టీలో కొత్త నాయకత్వాన్ని బలపరచడంతో పాటు యువత రాజకీయాలలో రాణించేందుకు, సభ్యత్వం స్వీకరించిన వారికి నాయకత్వ బాధ్యతలను అప్పగించడం, జనసేన పార్టీ కమిటీలలో ప్రాధాన్యత కల్పించడం 'ఉద్యమి' సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టామని జనసేన పార్టీ తిరుపతి నగర అధ్యక్షులు రాజారెడ్డి మేజర్‌న్యూస్‌కు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేసేందుకు ఆసక్తి కనపరిచే వారికే ఉద్యమి సభ్యత్వం ఇవ్వటం జరుగుతుంది. 2025లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గం రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా నిలచింది. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో తిరుపతి నియోజకవర్గం ఎక్కువశాతం సభ్యత్వం చేయించి రాష్ట్రంలో నెంబర్‌వన్ స్థానాన్ని అలాగే పదిలం చేసుకోవాలన్నదే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వం లో పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు అందరం సమష్టిగా కృషి చేసి సాధించడమే లక్ష్యమని రాజా రెడ్డి చెప్పారు.

మేజర్‌న్యూస్: జనసేన సభ్యత్వం కోసం ఎందుకు యువత ఆసక్తి చూపుతున్నారు..?

రాజా రెడ్డి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీ సిద్ధాంతాలు, ఆయన ఆశయాలు, ప్రజల సంక్షేమం బాగు కోసం ఆయన చేస్తున్న కార్యక్రమాలను చూసి

మిగతా 8లో

జన గణన దేశ నిర్మాణంలో అత్యంత కీలకం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక నిధుల కేటాయింపులో కూడా జనాభా ఒక ప్రధాన ప్రమాణంగా ఉండటంతో ప్రతి వ్యక్తిని లెక్కించడం చాలా ముఖ్యమని వివరించారు. ఎన్యూమరేటర్లు కొంతమంది వ్యక్తులను లెక్కించకుండా వదిలేస్తే అది పెద్ద మొత్తంలో జనాభా తగ్గినట్లుగా నమోదవుతుందని దీని ప్రభావంగా రాష్ట్రానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల నిధులు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సారి జన గణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని, అందువల్ల గతంలోలాగా ఫలితాలు రావడానికి ఎక్కువ సమయం పట్టదని, సాధారణంగా ఏడాది పట్టే ప్రక్రియ ఇప్పుడు డిజిటల్ విధానంలో సుమారు ఆరు నెలల్లోనే పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. కుల గణన కూడా నిర్వహించబడ నున్నందున అది సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతివర్గం యొక్క నిజమైన జనాభా వివరాలు తెలిసినప్పుడే సరైన ప్రాతినిధ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సాధ్యమవుతుందని వివరించారు. జన గణన కార్యక్రమాన్ని ప్రతి ఎన్యూమరేటర్ బాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించాలన్నారు. ఈ ప్రక్రియను నిజమైన "నేషన్ బిల్డింగ్ ఎక్సర్సైజ్"గా భావించి అందరూ సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాస్ రావు, జెడ్పి సీఈఓ రవికుమార్, డీఎఫ్ఓ సుబ్బరాజు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీటీలు, అసిస్టెంట్ స్టాటస్టికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్య పరీక్షలు

పాకాల, మేజర్‌న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సి)లో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకరాళ్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. చంద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పాకాల 1, 2 సెక్టార్‌లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకరాళ్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందజేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణపై మెడికల్ ఆఫీసర్ డా.జి.అలెగ్జాండర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు చిట్టెమ్మ, వెంకటరమణ, ఎస్.సుధా, ఎన్.డిస్నీ, ఐసీడీఎస్ సూపర్వైజర్ కిరణ్మయి, మెడికల్ ఆఫీసర్ డా. అరవింద్ కుమార్, స్టాఫ్ నర్స్ పుష్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్లో మహిళా వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్: వికసిత్ భారత్లో భాగంగా ఎమరాల్డ్స్ కళాశాల, మైభారత్ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్-2026 పేరుతో భారత ప్రజాస్వామ్యానికి 50 సంవత్సరాల ఎమర్జెన్సీ నుండి తీసుకోవాల్సిన పాఠాలు అనే అంశాన్ని నిర్వహించిన పోటీలలో పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారు. ఇందులో హోమ్సైన్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వెంకట నాగ నిహారిక, ఎల్ఎల్బీ విద్యార్థిని అమీన జైనబ్, ఎల్ఎల్బీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అనఘ జిల్లా స్థాయిలో ఎంపికయ్యారు. విశ్వవిద్యాలయం తరపున ప్రొఫెసర్ ఐవీ లలిత కుమారి వారిని అభినందించారు.

ఆటోలో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను భక్తుడికి అందజేత

చంద్రగిరి, మేజర్‌న్యూస్: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన మోహర్‌మునీశ్వర రతన్ కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చారు. అలిపిరి నుండి శ్రీవారి మెట్టు వరకు లగేజీ ఆటోలు కుటుంబం వచ్చింది. సాయంత్రం 6గంటలకు కావడంతో అదే లాస్ట్ ఆటో కావడంతో టిటిడి భద్రత సిబ్బంది ఆటో నెంబర్ను నోట్ చేసుకున్నారు. ఆటో వెళ్ళిపోయిన తర్వాత ఆటోలో ఐఫోన్ మర్చిపోయినట్లుగా భక్తులు టిటిడి భద్రత సిబ్బందికి తెలుపగా, భక్తులు ఆటో యజమానికి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించడంతో ఫోన్ నెంబర్ తీసుకున్న టిటిడి భద్రత సిబ్బంది ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి ఆటోలో సెల్ఫోన్ ఉందని చెప్పగా, ఆటో డ్రైవర్, వెతికి తిరిగి సెల్ఫోన్ తీసుకొని శ్రీవారి మెట్టు వద్దకు చేరుకు న్నారు. టిటిడి భద్రత సిబ్బందికి సెల్ ఫోన్ను అప్పగించారు. భద్రత సిబ్బంది సెల్‌ఫోన్‌ను మోహర్ మునీశ్వర్ రతన్ కుటుంబానికి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

చంద్రగిరి, మేజర్‌న్యూస్: పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిలో గత నెల 19వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం బోడెం బాయ్ సమీపంలో గత నెల 19వ తేదీ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో గాయపడిన మంజునాథ్ తిరుపతి సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, శుక్రవారం మృతి చెందారు చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వామ్మో.. దొంగలు

(మొదటిపేజీ తరువాయి)

భయపడిపోతున్నారు. ఒకవైపు పోలీసులు హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా దొంగతనాల సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పోలీసులు ఇప్పటికైనా నిఘాను కట్టుదిట్టం చేసి వరుస దొంగ తనాలను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.పోలీసులు గస్తి పెంచాలని కోరుకుంటున్నారు. ఎవరు లేని ఇండ్లే టార్గెట్ చేస్తూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.ఇప్పటికైనా పోలీసులు దోపిడీలకు అడ్డుకట్ట వేసే విధంగా దర్యాప్తు ముమ్మరం చేయాలని, దొంగలను పట్టుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాలనీల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు, పోలీస్ పెట్రోలింగ్ ఎక్కువ సార్లు కాలనీల్లో నిర్వహించాలని నాయుడుపేట ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చిత్తశుద్ధి ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

పాఠకులు పెంపుకు సిబ్బంది కృషి చేయాలి... జిల్లాలో 71 గ్రంథాలయాలు ద్వారా ఒక రోజుకి సుమారు 4000 మంది పాఠకులు సందర్శిస్తూ పుస్తక పఠనం చేస్తున్నారని, అది మరింతగా పెరిగేందుకు గ్రంథాలయ సిబ్బంది కృషి చేయాలని ఆయన కోరారు. ఇందుకు గ్రంథాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకొని సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

నగరపాలక సంస్థ మున్సిపాలిటీలు 33.87 కోట్లు బకాయిలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయాలకు జిల్లావ్యాప్తంగా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు ద్వారా 33.87 కోట్లు చెస్ బకాయిలు ఉన్నాయని, ఇందులో తిరుపతి నగరపాలక సంస్థ 22 కోట్ల 35 లక్షలు, చిత్తూరు మున్సిపాలిటీ ఐదు కోట్ల 39 లక్షలు, శ్రీకాళహస్తి కోటి 77 లక్షలు, ఇలా జిల్లా వ్యాప్తంగా పెండింగ్ లోని బకాయిలను గ్రంథాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అధికారులతో కలిసి వసూళ్లు చేయాలని ఆదేశించారు. తాను కూడా సంబంధిత అధికారులను కలిసి చెస్ బకాయిల సొమ్ము వసూళ్లకు కృషి చేస్తానని తెలియజేశారు. గ్రంథాలయాల అభివృద్ధి జరగాలన్న సిబ్బందికి జీతభత్యాలు రావాలన్న ఏ కార్యక్రమం చేపట్టాలన్న చెస్ వసూళ్లు విషయాన్ని గ్రహించాలని కోరారు.

సిబ్బంది కొరతను త్వరలోనే పరిష్కరిస్తాం... ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 71 గ్రంథాలయాలలో సిబ్బంది కొరత ఉందని, రెగ్యులర్ సిబ్బంది 34 మంది, అవుట్సోర్సింగ్ సిబ్బంది 14 మంది ఉన్నారని, సిబ్బంది కొరతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్చించామన్నారు. అనంతరం గ్రంథాలయ ఉద్యోగులు, బీడీసీ నిర్వాహకులు చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డిని పూలమాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి ఆర్.వి.యస్.యస్. శర్మ జిల్లాలోని గ్రంథాలయ అధికారులు, బీడీసీ నిర్వాహకులు, కార్యాలయ సిబ్బంది, 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

హోమియో మందులు పంపిణీ

చిట్టమూరు మేజర్‌న్యూస్: చికెన్ ఫాక్స్ ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా చిట్టమూరు మండలం గుణపాడు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కోట మండలం చెందోడుకు చెందిన ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారానికి సరిపడా హోమియో మందులను పంపిణీ చేశారు.ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ,కార్యదర్శి ఎం విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు భూపయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ పిల్లర్ సెంటర్‌లో అడుగంటిన 'స్వచ్ఛభారత్'.. పట్టించుకోని అధికారులు

రోడ్డుపైనే చెత్తకుప్పలు.. దుర్గంధంతో ప్రజల అవస్థలు
నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

వాకాడు, మేజర్‌న్యూస్: వాకాడు మండల కేంద్రంలోని అత్యంత కీలకమైన అశోక్‌పిల్లర్ సెంటర్ వద్ద 'స్వచ్ఛ భారత్' లక్ష్యం అభాసు పాలవుతోంది. అశోక్ పిల్లర్ నుంచి దుగ్గరాజుపట్నం వైపు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు పక్కన ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. నిత్యం వందలాది మంది ప్రజలు, వాహనదారులు తిరుగాడే ఈ ప్రాంతంలో పారిశుధ్యం పడకేసినా, అధికారులు కానీ, గ్రామ పంచాయతీ సిబ్బంది కానీ పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి ఈ రోడ్డు పక్కన డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు, ఇతర వ్యర్థాలు గుట్టలుగా పేరుకు పోయాయి. కొందరు వ్యాపారస్తులు, ముఖ్యంగా టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు చెత్తను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి, పందులు విపరీతంగా సంచరిస్తున్నాయి. చెత్తకుప్పల వల్ల ఆ ప్రాంతంలో తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. దీనికి తోడు దోమల బెడద పెరగడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో, అటుగా వెళ్లే ప్రజలు, అధికారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రభుత్వం స్వచ్ఛత కోసం కోట్లు ఖర్చు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి, రోడ్డు పక్కన చెత్తను తక్షణమే తొలగించాలని, నిబంధనలు అతిక్రమించే వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని వాకాడు ప్రజలు కోరుతున్నారు.

ప్లేట్లు చెప్పులు, వాటర్ బాటిల్ పంపిణి

వాకాడు, మేజర్‌న్యూస్: మండలంలోని బీసీ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పిల్లలకు భోజనం ప్లేట్లు, పాదరక్షలు, వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాకెట్లు, పంపిణీ చేశారు తిరుపతి జిల్లా బిజెపి ఎగ్జిక్యూటివ్ నెంబర్ కాలవల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నిఖిల్ బాబు, అంగన్వాడి కోట ప్రాజెక్ట్ సిడిపిఓ, ముని కుమారి, పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకోండి : కనుపూరు జగదీష్

చిట్టమూరు, మేజర్‌న్యూస్: చిట్టమూరు మండలం యాకశిరిలో నిరుపేద రజక కుటుంబానికి చెందిన నంద్యాల సుమన్ (21) యువకుడు గుండెపోటుతో గత కొంతకాలం క్రితం మృతి చెందాడు. సమీప పట్టణం నాయుడుపేటలో దినసరి కూలీగాజీవనం కొనసాగిస్తూ తల్లి దండ్రులను పోషించుకుంటున్న క్రమంలో సుమన్ గుండెపోటుకు గురై మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న నవ్యాంధ్రప్రదేశ్ రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనుపూరు జగదీష్ శుక్రవారం యాకసిరిలో కుటుంబాన్ని కలుసుకుని పరామర్శించి, ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న తల్లి దండ్రులకు ఆసరాగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతితో కుటుంబం వీధిన పడిందన్న జగదీష్ స్థానిక శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్, కూటమి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలన్నారు.

ధైర్యంగా చెప్పండి.. న్యాయం వైపు నడవండి

గూడూరు, మేజర్‌న్యూస్: విలువలతో కూడిన విద్య అవసరమని రూరల్ ఎస్సై తిరుపతయ్య తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా ఆదిశంకర టెక్నో స్కూల్ విద్యార్థులకు రూరల్‌పోలీస్ స్టేషన్లో చట్టాలపై అవగాహన కల్పించారు. గూడూరు పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్సై తిరుపతయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ధైర్యంగా చెప్పండి– న్యాయం వైపు నడవండి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిశంకర టెక్నోస్కూల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య అవసరమని, విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మహిళలకు పటిష్టమైన రక్షణ అందించడంలో పోలీస్ వ్యవస్థ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు, మేజర్‌న్యూస్: గూడూరులో భారీగా అక్రమ రేషన్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రెండో పట్టణ పరిధిలోని మధు రెడ్డి కాలనీలో ఓ ఇంట్లో చెన్నైకి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 100 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మినీ ట్రక్కును సీజ్ చేశారు. ఏఎస్ఓ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచామన్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు కొత్త మార్గాలను వెతుకుతున్నారన్నారు. స్థానికుల సమాచారంతో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై గోడౌన్ కు తరలించనున్నట్లు వెల్లడించారు.

టిప్పర్లను అడ్డుకున్న మహిళలు, గ్రామస్తులు

వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్: వరదయ్య పాలెం మండలం బత్తులవల్లం పంచాయితీ అడవి ప్రాంతం నుంచి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను మహిళలు ఆపి ధర్నా చేశారు. టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలింపు వల్ల రోడ్లు విపరీతంగా దెబ్బతిన్నాయని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల అండదండలతో ఎర్రమట్టి విక్రయాలు జోరు అందుకున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు స్పందించి ఎర్రమట్టి రవాణాను ఆపాలని వారు కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

వెదురుకుప్పం, మేజర్‌న్యూస్: బాల్య వివాహాలను అరికట్టాలని కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ శకుంతల అన్నారు. బాల్య వివాహ్ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల విద్య, బాలికల రక్షణ, బాల్యవివాహాలు, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకాలు గురించి విపులంగా వివరించారు. అదేవిధంగా పచ్చికాపలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

పేద రైతులకు న్యాయం చేయండి - జడ్పీటీసీ రామకృష్ణ

వాకాడు మేజర్‌న్యూస్: మండలంలోని తీర ప్రాంత గ్రామాలలో పేద రైతులకు ఒకప్పుడు ప్రభుత్వం అందించిన సాగు భూములు నేడు భూస్వాముల ఆధీనంలో ఉన్నాయని వాటిని ఆయా పేద రైతులకు అప్పజెప్పి న్యాయం చేయాలని, వాకాడు జడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం రైతులతో కలసి తహసీల్దార్ సయ్యద్ ఇగ్బాల్కు వినతి పత్రం సమర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ అందలమాల, వాగరు, వాలమేడు, కొండూరు, గంగనపాళెం, పామంజి గ్రామాలలో వంద సంవత్సరాల కిందట అప్పటి ప్రభుత్వం పేద రైతులకు సాగు చేసుకోవడానికి తలా కొంచెం భూములను కేటాయించడం జరిగిందన్నారు. ఐతే వాటిని కొందరు భూ స్వాములు వాటిని తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఆక్వా పరిశ్రమలకు ఉపయోగించుకుని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈక్రమంలో నేడు తీరప్రాంతంలో పలు పరిశ్రమలు రానున్న క్రమంలో ఆ భూములను ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించే క్రవ ఎంలో ఆ నష్ట పరిహారం పేదలకు చెందేలా అధికారులు న్యాయం చేయాలని రామకృష్ణ కోరారు. పేద రైతులకు కేటాయించిన భూములపై పూర్తి సర్వేచేసి పేద రైతులకు న్యాయం చేయాఇలని, లేదంటే పేదల పక్షాన పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో మెరిసిన తిరుపతి అమ్మాయి

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: యూపీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన సివిల్స్ సర్వీసెస్ ఫలితాలల్లో తిరుపతికి చెందిన యారాశి. తుషారిక రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరచి 393 ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి వైఎం గురువారెడ్డి తిరుపతి బీఎస్ఎన్ఎల్లో రిటైర్డ్ ఉద్యోగి. తల్లి ఏ మల్లీశ్వరి టీటీడీలో సూపరింటెండెంట్గా విధులు నిర్వహిస్తోంది. టీటీడీ పరిపాలనా భవనం వద్దగల టీటీడీ క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. స్థానిక కేశవరెడ్డి పాఠశాలల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఇంటర్ నారాయణ కళాశాలలో చదివిన ఆమె చెన్నైలోని ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్లో బీటెక్ పూర్తి చేసిన వెంటనే ఢిల్లీలో ఓ ప్రముఖ కోచింగ్ సెంటర్లో రెండేళ్లు కోచింగ్ తీసుకున్నారు. మూడు సార్లు సివిల్స్ పరీక్షలలో విఫలమైనా ముక్కవోని ఆత్మవిశ్వాసంతో మళ్లీ ప్రయత్నించి నాల్గవ సారి 393 ర్యాంక్ సాధించాను. సర్వీసెస్లో ఐఆర్ఎస్ కానీ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ పోస్టు రావచ్చని అంచనా వేస్తున్నారు.

మెడికల్ క్యాంపు విజయవంతం

తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్: శుక్రవారం స్థానిక కొంకావీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ నందు లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ చైర్పర్సన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ విచ్చేశారు. తిరుపతి స్పీచ్ హియరింగ్‌సెంటర్ అధినేత, ఆడియాలజిస్ట్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరానికి ఒకసారి ఆడియాలజిస్ట్‌ను సంప్రదించి వినికిడి నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. అలాగే వృద్ధాప్య సమయంలో వినికిడి శక్తి తగ్గుతూ ఉండడం సహజమైనందున ఇలాంటి వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వినికిడి పరీక్షలు చేసుకోవడం వలన సమస్యను నివారించుకోవచ్చన్నారు. పేదవారికి రాయితీపై యంత్రాలను అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ మెడికల్ క్యాంప్ నందు సుమారు 50 మందికి పైగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడియాలజిస్టులుడాక్టర్ గోపీనాథ్, డాక్టర్ రంజిత్ కుమార్,లయన్స్ క్లబ్ ప్రతినిధులు అర్కాట్ కృష్ణప్రసాద్, జగన్నాధం,ఈశ్వర్ రెడ్డి, శాంతి పాల్గొన్నారు.

ఔషధ తయారీలో సాంకేతికత అవసరం

రామచంద్రపురం, మేజర్‌న్యూస్: ఔషధ తయారీ రంగంలో సాంకేతికత వినియోగం ఎంత అవసరమని పాత జింగ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డాక్టర్ సయ్యద్ రహమతుల్లా అన్నారు శుక్రవారం వెంకటరామపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఫాదర్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ ఎమ్మెల్ ఫ్రాఫ్224 జయంతిని ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవా ఔషధ రంగాల్లో నాణ్యత కొలమానా లను పాటించాలన్నారు విద్యార్థులకు మెలికల మేలుకువలు అవసరం అన్నారు ఈ కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్రీయ సభ్యులు డాక్టర్ నిరంజన్ బాబు సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్నరాజు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అంటు వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోండి

రామచంద్రపురం, మేజర్‌న్యూస్: అంటూ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వ్యక్తిగత శుభ్రత అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం కమ్మపల్లి కుప్పం బాదూరు ప్రాథమిక ఆరోగ్యంగా జాతీయ బోధకాల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ ఎంఈ డైరెక్టర్ చినబాబుతో కలిసి ఎంఎండిపి కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోదకాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు బోధకాలతో బాధపడుతున్న వారు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధిని పూర్తిస్థాయిలో అదుపు చేయవచ్చునని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రూప్ కుమార్ మలేరియా సభ్యుని అధికారి మోహన్ బాబు వైద్యాధికారులు డాక్టర్ తేజ, డాక్టర్ మురళీ కృష్ణ డాక్టర్ పూర్ణ పాల్గొన్నారు.

కాట్రకాయలగుంటలో అంగన్వాడి భవనం ప్రారంభం

ఏర్పేడు, మేజర్‌న్యూస్:

ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలు మేరకు ఏర్పేడు మండలం కాట్రకాయలగుంట గ్రామంలో అంగన్వాడి భవనం మరమ్మత్తులు చేశారు. కోకో కోలా వారి సౌజన్యంతొ ఆధునిక హంగులతో రూపొందించిన భవనంను శుక్రవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి నాగరాజు నాయుడు. తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : డిఆర్ డిఏ పిడి శ్రీదేవి

చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చిత్తూర్ డిఆర్ డిఏపిడి శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా సమాఖ్య కార్యాలయంలో మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అముద ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ శక్తి ముందు ఏ శక్తి పనిచేయదన్న విషయాన్ని ప్రతి ఒక్క మహిళా గుర్తించి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలన్నారు. నేడు మహిళలు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తూ అనేకమంది స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కుటుంబంలో మహిళ సమర్థవంతంగా తన బాధ్యతను నెరవేరిస్తే ఆ కుటుంబ జీవన ప్రమాణం సాఫీగా సాగుతున్న విషయాన్ని ప్రతి ఒక్క మహిళ గుర్తించాలన్నారు. నేడు పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుంది అన్న విషయాన్ని ప్రతి మహిళ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య సామాజిక రంగాలపై కూడా మహిళలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా లోకానికి పిడి ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం లు రవికుమార్, మంజుల, డిపిఎంలు సుబ్బారెడ్డి మధు, హేమ, పలువురు సంఘ సభ్యులు జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యం.. న్యాయం.. ధర్మం నా వైపు ఉంది : కల్వకుంట్ల కవిత

– శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్న కవిత

తిరుమల, మేజర్న్యూస్: సత్యం న్యాయం ధర్మం నా వైపు ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని శుక్రవారం ఉదయం వేకువజామున అభిషేక సేవలో కవిత పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నాలుగు సంవత్సరాలుగా పడుతున్న మనోవేదన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దయతో తీరిందని ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుతుల ఆమె మీడియాతో మాట్లాడుతూ సత్యం న్యాయం ధర్మం నా వైపు ఉందని చెబుతూ వస్తున్న మాట నిజమైందని కోర్టు క్లీన్ చీట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించుకునేందుకు కాలినడకన తిరుమలకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నానని చెప్పారు. అలాగే రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజల పక్షాన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నానని ఆ పార్టీకి స్వామి వారు ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలియజేశారు.

పులికాట్‌లో ఆంధ్ర - తమిళనాడు సరిహద్దు సమస్యలపై అధికారులు సంయుక్త పరిశీలన

తడ, మేజర్ న్యూస్: మండల పరిధిలోని పులికాట్ సరస్సులో ఆంధ్ర తమిళనాడు సరిహద్దు సమస్యలపై ఆంధ్ర తమిళనాడు అధికారుల సంయుక్త బృందం శుక్రవారం సరిహద్దులను పరిశీలించారు. ఈ సరిహద్దు పరిశీలనలో సూళ్లూరుపేట ఆర్డీవో మరియు నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు, సూళ్లూరుపేట సిఐ ఎం మురళీకృష్ణ,తడ ఎమ్మార్వో కె రవికుమార్, ఎఫ్ఆర్ఓ రమణయ్య తో పాటు ఫిషరీస్ శాఖ అధికారులు ఉన్నారు. ఆంధ్ర తమిళనాడు పులికాట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ కూడా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రెవెన్యూ, పోలీస్, ఫిషరీస్, ఫారెస్ట్ శాఖ అధికారులు కూడా హాజరై సరిహద్దు ప్రాంతాలను పరిశీలించి సమస్యలపై చర్చించారు. ఈ పులికాట్ సరస్సులో జాలర్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

తెదేపా చిట్టమూరు మండల కన్వీనర్ కిషోర్ నాయుడుకి

రాష్ట్రస్థాయి అత్యున్నత కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖరారు..!

– నాలుగు దశాబ్దాల ప్రజా సేవలో గణపర్తి కుటుంబం
– ప్రజా సేవకు కోట్ల రూపాయల ఆస్తులు ధారాదత్తం
– పని చేసే నాయకులను గుర్తిస్తే పార్టీ మరింత బలపడే అవకాశం

తెలుగుదేశం పార్టీ చిట్టమూరు మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడుకి రాష్ట్రస్థాయి అత్యున్నత కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖరారు అయినట్లు విశ్వసనీయ వర్గాల తెలిసింది. రాష్ట్ర స్థాయి ఉన్నత పదవి ఆశించిన కిషోర్ నాయుడుకి పదవి కేటాయింపులో ఆలస్యంపై అసంతృప్తిలో ఉన్న కేడర్ కు అధినాయకత్వం తీపి కబురు అందించింది.నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పదవుల ఆశించని గణపర్తి కుటుంబ రాజకీయ వారసుడు కిషోర్ నాయుడు సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి ఉన్నత పదవిని కట్టబెట్టనుంది.ఆమేరకు త్వరలో అధికారిక ప్రకటన విడుదల కానుంది. పార్టీ ఆవిర్భావం నుండి ప్రజాసేవకు అంకితమై విలువైన భూములను ప్రజా అవసరాలకు కేటాయించి,పార్టీ ప్రయోజనాలు, పటిష్టతే ధ్యేయంగా పనిచేస్తున్న నాయుడు కుటుంబానికి పదవి కట్టబెట్టాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధిష్టానం నిర్ణయం తీసుకుందన్న వార్తల నేపథ్యంలో చర్చనీయాంశమైంది.ఐదేళ్ల ప్రతిపక్ష వైకాపా ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, నిర్బంధాలు, దౌర్జన్యాలు, దాష్టీకాలతో ఇబ్బందులు ఎదుర్కుని మొక్కవోని అకుంఠిత దీక్షతో పార్టీ అభివృద్ధికి పని చేశారన్న పలువురు తెదేపా నాయకులు తెలుగుదేశం పార్టీ పిలిపిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించి,సక్సెస్ చేసి,నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీని విజయతీరాలకు చేర్చి, నెల్లూరు, తిరుపతి రెండు జిల్లాలలో తెలుగుదేశంలో తిరుగులేని శక్తిగా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుని పార్టీలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు.యువ నాయకుడు నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన యువగళం పాదయాత్ర చిట్టమూరులో భారీ సక్సెస్ కావడం,ఈ సందర్భంగా కిషోర్ నాయుడుకి రాష్ట్రస్థాయి ఉన్నత పదవి కేటాయిస్తానని ప్రకటించి,మాట ఇచ్చిన లోకేష్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తిరుపతి,నెల్లూరు జిల్లాల పలువురు ఎమ్మెల్యేల భేటీలో చర్చకు రాగా మంత్రులు పొంగూరు నారాయణ,ఆనం రామనారాయణ రెడ్డి,బీద రవిచంద్ర,కొండేపాటి గంగా ప్రసాద్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,పనబాక లక్ష్మి,పలువురు ఎమ్మెల్యేలు కిషోర్ నాయుడుకి మద్దతు తెలపడంతో రాష్ట్రస్థాయి పదవికి మార్గం సుగమమైంది.పనిచేసే నాయకులను గుర్తించి పదవులు కట్టబెడితే పార్టీ మరింత బలపడే అవకాశం ఉందని,ఇప్పటికైనా కిషోర్ నాయుడుకు రాష్ట్ర స్థాయి ఉన్నత పదవికి అధిష్టానం ఎంపిక చేయడం శుభ పరిణామమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.కిషోర్ నాయుడుకి రాష్ట్రస్థాయి అత్యున్నత కార్పొరేషన్ చైర్మన్ పదవి దాదాపుగా ఖరారు కావడంతో అధికారిక ప్రకటన తరువాయి సంబరాలకు తెదేపా శ్రేణులు సమాయత్తమవుతున్నారు.

– చిట్టమూరు మేజర్న్యూస్

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

పుత్తూరు, మేజర్ న్యూస్: అగ్నిప్రమాదాల నివారణపై పుత్తూరులోని వివేకానంద పాఠశాల లోని విద్యార్థులకు స్టేషన్ ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ గిరిధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏఏ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాలు నివారించవచ్చు అన్నారు. అనంతరం అగ్నిమాపక వాహనం, అగ్నిమాపక సీలిండర్లని విద్యార్థులకు చూపించారు. ఏఏ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ సదాశివం, ఎల్ ఎఫ్ ఓ నాగేశ్వర్ రావు, ఫైర్ మేన్ మనోజ్, డిఓపి విశ్వనాధం శెట్టి,గోవిందరాజులు, హోమ్ గార్డు బాల నరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన తరంగ్-2026

– ఉత్సాహంతో అలరించిన నృత్యం
– ర్యాంపు వాక్ తో ఆకట్టుకున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్న్యూస్ : కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంతో ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. గత రెండు రోజులుగా కళాశాలలో తరంగ్-2026 పేరిట నిర్వహించిన వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు పదర్శించిన పలు సాంస్కృత, నృత్య ప్రదర్శనలను అలరించాయి. ఇందులో భాగంగా విద్యార్థులు స్కిట్స్, ట్రెడిషినల్, వెస్టర్న్ డాన్స్ వీక్షకులను అలరించారు. అనంతరం దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వస్త్రలంకరణ ధరించి విద్యార్థులు ర్యాంపు వాక్‌తో ఆకట్టుకున్నారు. కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళలను ప్రోత్సాహించటానికి ప్రతి సంవత్సరం కళాశాల వార్షికోత్సవం నిర్వహిస్తారన్నారు. రెండు రోజుల పాటు జరిగిన తరంగ్ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసు, కన్వీనర్ డాక్టర్ నాగేంద్ర, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించాలి : అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్

– కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవు

చిత్తూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ : పదవ తరగతి పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్ పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మార్చి నెల 16 తేదీ నుండి నిర్వహించే ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పదో తరగతి పరీక్షల సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు అమలులో భాగంగా ఆయా పాఠశాల హెడ్మాస్టర్ లతో, డిప్యూటీ తాసిల్దార్లతో, ఎంఈఓ లతో, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్‌జిడి శామిల్, డీఈవో రాజేంద్రప్రసాద్, డిప్యూటీ డిఈఓ లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేయడంలో, విద్యార్థులు రాసిన ఆన్సర్ పత్రాలను స్ట్రాంగ్ రూములకు చేరవేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన పోలీసు శాఖ వారు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి చిన్న తప్పును సహించనని, కాపీయింగ్ జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆర్జెడి శ్యాముల్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలక పాత్రపోషిస్తాయని, వీటిని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్ర ప్రసాద్ పదవ తరగతి పరీక్షలపై వివిధ అంశాలను అసిస్టెంట్ కలెక్టర్లకు వివరించారు. జిల్లాలో 129 కేంద్రాలలో 23,095 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారన్నారు. 12,105 మంది అబ్బాయిలు 10,990 మంది అమ్మాయిలు పరీక్షకు హాజరు అవ్వబోతున్నారన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డికే పల్లిలో అగ్ని మారెమ్మ గుడి జాతర ఆరంభం

కుప్పం, మేజర్ న్యూస్ :
కుప్పం పట్టణంలోని దలవాయి కొత్తపల్లి ప్రాంతంలో వెలసిన అగ్ని మారెమ్మ అమ్మవారి గుడి జాతర సందర్భంగా శుక్రవారం చాటింపు కార్యక్రమంలో భాగంగా సంప్రదాయబద్ధంగా కొడి కట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతర ప్రారంభానికి సంకేతంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రాంతీయ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలకరణతో పూజది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు దలవాయి కొత్తపల్లి మాజీ సర్పంచ్ మణి, ససోమశేఖర్ తదితరులు కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్, దళిత నాయకులు కందస్వామి, గణపతి తదితరులను ఘన స్వాగతించారు. అనంతరం అమ్మవారికి మంగళహారతి ఇచ్చి నాయకులను ఘనంగా సన్మానించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది.

కనీస వేతనంగా రూ. 30 వేలు చెల్లించాలి

– సచివాలయం ఉద్యోగులతో సమానంగా పే స్కేలు పర్తింపజేయాలి
– గ్రామీణ సర్వేయర్లు డిమాండ్ –కలెక్టరేట్ ఎదుట గ్రామీణ సర్వేయర్ల ధర్నా

చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్: తమకు నెలకు కనీస వేతనంగా రూ 30 వేలు చొప్పున చెల్లించాలని గ్రామీణ సర్వేయర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా గ్రామీణ సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామీణ సర్వేయర్లు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు వినోద్ కుమార్, సోమశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులతో సమానంగా తమకు పే స్కేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు అత్యుత్తమ సేవలందిస్తున్న సర్వేయర్లు విధుల్లో చేరినప్పటి నుంచి చాలీచాలని వేతనాలతో కష్టించి పనిచేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా, పై అధికారులు మాత్రం ఎటువంటి విచారణ చేపట్టకుండా సర్వేయర్లనే బాధ్యులుగా చేసి షోకాజ్ నోటీసులు జారీ, పనిష్మెంట్లకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు నియమింపబడ్డ సచివాలయ ఉద్యోగులకు నెలకు రూ 30 వేలు చొప్పున వేతనం వస్తోందని, వారి కంటే అధికంగా కష్టపడే తమకు మాత్రం రూ 25 వేలు ప్రాతిపదికన బేసిక్ పే నిర్ణయించడం అన్యాయమని వాపోయారు. ఈ విషయమై తాము సర్వే శాఖ రాష్ట్ర కమిషనర్ కు విన్నవించినా ఫలితం లేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో తాము ఈ నిరసన చేపట్టాల్సి వస్తోందని, ఇకనైనా ప్రభుత్వం, అధికారులు తమ ధైన్య స్థితిని అర్థం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్ కు వినతిపత్రం సమర్పించి, తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిడి మాట్లాడుతూ వెంటనే గ్రామీణ సర్వేయర్ల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామీణ సర్వేయర్లు తమ నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ సర్వేయర్ల సంఘం నాయకులు షణ్ముగం, నరేష్, ప్రతాప్, పరిమళ, దీప్తి, భవ్యశ్రీ, విమలకుమారితో పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రామీణ సర్వేయర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం పురుషుడి బాధ్యత : వీసీ టాటా నర్సింగరావు

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్: సమాజంలో మహిళలను గౌరవించడం, వారిని ప్రోత్సహించడం ప్రతి పురుషుడి బాధ్యతని వీసీ టాటా నర్సింగరావు పేర్కొన్నారు. ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళల రక్షణ చట్టం అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం వర్సిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక సంస్థ ఆరోగ్యకరంగా, పటిష్టంగా ఉండాలంటే మహిళల భాగస్వామ్యం ఎంత కీలకమన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే వృత్తిపరమైన సవాళ్లను ధీటుగా ఎదుర్కొంటున్నారని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనేక ఆవిష్కరణలు చేస్తున్నారని కొనియాడారు. సమాజంలో రక్షణ, భద్రత అనేది మహిళల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ అప్పారావు, ప్రిన్సిపల్ కే సుధారాణి, డైరెక్టర్ ప్రొఫెసర్ సాయి సుజాత, ఆచార్య రమాశ్రీ, ఆర్ మీరా, మహిళా అధ్యయన కేంద్రం అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ రమణ, డాక్టర్ జగదీశ్వరి, డాక్టర్ రాజ రాజేశ్వరి, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

తిరుమల, మేజర్ న్యూస్: తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని పలువురు ప్రముఖులు శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. వీరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ , సినీనటి జాన్వికపూర్ , సినీనటి రుక్మిణి వసంత్ తదితరులు ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వీరికి ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా టిటిడి అధికారులు తీర్చప్రసాదాలు అందజేశారు.

పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

పలమనేరు మేజర్‌న్యూస్ : రూరల్ మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని కొంతమంది రైతుల పంటలపై గురువారం రాత్రి 8.30 గంటలకు ఒంటరి ఏనుగు గ్రామానికి ఆనుకుని ఉన్న అడవిలో నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు గ్రామానికి చెందిన వినాయకం అనే రైతు అతని భూమితో పాటు పక్కన ఉన్న భూమిని కూడా కౌలుకు తీసుకుని అందులో పశుగ్రాసం అరటి తదితర పంటలను సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి 8.30 గంటలకు పొలానికి ఆనుకుని ఉన్న అడవి నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు పశుగ్రాసం తోపాటు అరటి చెట్లను ధ్వంసం చేయడమే కాకుండా పైపులను ధ్వంసం చేసి పొలానికి వేసిన ఫెన్సింగ్ లను విరిచి నష్టం చేయడమే కాకుండా పక్కనున్న రైతుల పొలాల్లో మిరప పశుగ్రాసం తదితర పంటలను తిని ధ్వంసం చేస్తున్న సమయంలో తమ పొలాల వద్ద చాలా మంది ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న ఇళ్ల వద్ద కుక్కలు అరవడంతో అక్కడున్న రైతులందరూ ఈ ఏనుగును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఏనుగు ఇళ్లపైకి వస్తే పిల్లాపాపలను.పాడి పశువులను ఎలా కాపాడుకోవాలని భయాందోళనలకు గురై గ్రామస్తులందరూ ఏనుగును తరిమెందుకు ప్రయత్నం చేశారు. కొందరు ఇళ్లపైకి ఎక్కి చూస్తున్నారు. కొందరు ఈ ఏనుగును తరిమెందుకు రాత్రంతా అనేక ప్రయత్నాలు చేశారు. కానీ అడవిలోనికి వెళ్ళ లేదు. అష్ట కష్టాలు పడి తెల్లవారుజామున. అడవిలోకి మళ్లించారు.వ్యవసాయానికి రాత్రిపూట కరెంటు ఇవ్వడం వలన రైతులు రాత్రివేళ తమ పొలాలకు నీరు పెట్టేందుకు ఏనుగుల వలన భయాలకు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. కాబట్టి ప్రభుత్వం స్పందించి పంట పొలాలపై ఏనుగులు రాకుండా తగు చర్యలు తీసుకుని అటవీ సమీపంలోని ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేపట్టాలని అదేవిధంగా తమ వ్యవసాయ భూములకు అటవి శాఖ అధికారుల ఆమోదంతో రైతులకు వంద శాతం పూర్తి సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఎప్పటి నుంచో పలుమార్లు అధికారులకు తెలియపరుస్తున్నా కూడా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా పంట పొలాలపై ఏనుగులు రాకుండా ఇంద్రానగర్ నుంచి చెత్త పెంట గ్రామం వరకు సోలార్ ఫెన్సింగ్ వెంటనే ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ప్రపంచ టిబి వ్యాధి నిర్మూలనపై అవగాహన

గుడిపల్లి, మేజర్‌న్యూస్: ప్రపంచ టిబి వ్యాధి నిర్మూలన దినోత్సవం మార్చి 24 వ తేదీని పుర స్కరించుకొని కుప్పం ఆర్టీసీ బస్టాండ్ కూడలి లో కుప్పం పి.ఈ.ఎస్ ఆసుపత్రి, జిల్లా టిబి నిర్మూల న విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 6వ తేదీ అవగాహన కార్యక్రమం నిర్వహించి నట్లు మెడి కల్ సూపరింటెండెంట్ డా.ఎన్ కే .సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా టి.బి కంట్రోల్ ఆఫీసర్ డా. వెంకట ప్రసాద్ ముఖ్య అతిథి గా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు పి.ఈ.ఎస్ ఆసుపత్రి మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. ఉమా, ప్రొఫెసర్ డా. రఘురామ్, కమ్యూనిటీ విభాగం ప్రొ. డా. అనిల్ రాజ్ మాట్లాడుతూ టి .బి.వ్యాధి మనుషులలోవ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు ఎక్కువగా వ్యాప్తి చెం దుతుందనీ అలానే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, ఛాతి నొప్పి, బరువు తగ్గడం,వంటి లక్షణాలు ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు వైద్యుని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పొందా లని అలాగే వ్యాధి నివారణ కోసం మందులు పిఈఎస్ ఆసుపత్రి మరియు ప్రభుత్వ ఆసుపత్రు లలో ఉచితంగా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పి.ఈ.ఎస్ ఆసుపత్రి మెడిసిన్ విభాగాధిపతి డా. ఉమా, ప్రొ. డా. రఘురామ్ , జిల్లా టీబి కంట్రోల్ ఆఫీసర్ డా. వెంకట ప్రసాద్ , కమ్యూనిటీ విభాగం ప్రో. డా. అనిల్ రాజ్, నర్సింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మెల్విన్ డేవిడ్, గవెర్నమెంట్ ఎన్ టి ఈ పి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

పుంగనూరు, మేజర్ న్యూస్: పట్టణంలోని కోర్టు రోడ్ లో ఓ కరెంటు స్తంభాన్ని శుక్రవారం లారీ వెనుకకు రివర్స్ వస్తుండగా అనుకోకుండా కరెంటు స్తంభాని ఢీకొనడంతో స్తంభం విరిగి వైర్లు కిందికి వాలిపోయాయి, ట్రాన్స్ఫార్మర్ ట్రిప్‌పై కరెంట్ ఆగిపోవడంతో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

విద్యుదాఘాతంతో రేకుల ఇల్లు దగ్ధం

తడ, మేజర్ న్యూస్: మండలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేకులలో దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది బాధితుల వివరాల మేరకు తడ మండలం చేనుగుంట ఎస్టీ కాలనీలో ఈటిపాకుల నాగార్జున నివాసం ఉంటున్నారు ఎప్పటిలాగే ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కూలి పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లేవారు అయితే పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో నుంచి పొగ వాసన రావడంతో అనుమానం వచ్చి పరిశీలించారు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కారణంగా ఇంటి లోపల ఉన్న బట్టలు, గృహోపకరణాలు, కొంత నగదు పూర్తిగా కాలిపోయినట్లు గుర్తించారు ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో నాగార్జున కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ బోరున విలపించారు ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు సంబంధిత అధికారులు స్పందించి అగ్ని ప్రమాదంతో నష్టపోయిన తమను ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు ఆదుకోవాలని నాగార్జున కుటుంబ సభ్యులు కోరారు.

ఇంటర్ జువాలజీ పేపర్-2 పరీక్షకు 251మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 82 కేంద్రాలలో జరిగిన ఇంటర్ సెకండ్ ఇయర్ జువాలజీ పేపర్-2 పరీక్షకు 251మంది గైర్హాజరైనట్లు ఆర్ఎఓ జి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాలో జరిగిన జనరల్ పరీక్షకు 8,798 మంది హాజరుకావాల్సి ఉండగా 8547మంది హాజరయ్యారని, అలాగే జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలలో జరిగిన ఒకేషనల్ పరీక్షలకు 1082 మందికి గాను 1050మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతు న్నాయని, శనివారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఎకనామిక్స్ పేపర్-1 పరీక్ష జగురుతుందన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పాకాల, మేజర్ న్యూస్: గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామలచెరువు నందు పాఠశాల ప్రధానోపాధ్యా రా లు సుమతమ్మ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు మరియు పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహి ంచారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి బాబ్జి హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రేమ గురువుల ఆశీస్సులు విద్యార్థుల విజయంలో కీలకమని కనిపించే దేవుళ్లే తల్లిదండ్రులు, గురువులని పేర్కొన్నారు. గడిచిన కాలం మధుర జ్ఞాపకం రాబోయే కాలం ఒక గొప్ప అవకాశం విద్యార్థుల జ్ఞాపకాలను పాఠశాల దాచుకుంటే వారి లక్ష్యాలు ప్రపంచాన్ని జయిస్తాయి అని పాఠశాలలో నేర్చుకున్న పాఠాలు జీవిత ప్రయాణంలో వెలుగునిస్తాయి వీడ్కోలు కేవలం విడిపోవడం కాదు కొత్త ప్రయాణానికి నాంది అని బాబ్జి అన్నారు. తదుపరి స్కూల్ డే సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మరియు సైన్స్ డే విజేతలకు ప్రశంస పాత్రల తోపాటు మెడల్స్ అందజేశారు. విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు కోటేశ్వర నాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మహిళ వర్సిటీ 22వ స్నాతకోత్సవం

-1001మందికి పట్టాభిషేకం
- హాజరుకానున్న గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చాన్సలర్
-డీఆర్డీఓ రిటైర్డ్ సైంటిస్టు శశికళ సిన్హాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం
-మీడియా సమావేశంలో వీసీ ప్రొఫెసర్ వి.ఉమ

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: పద్మావతి మహిళా వర్సిటీ 22వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వీసీ ప్రొఫెసర్ వి.ఉమ తెలిపారు. సావేరి అతిథిగృహంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆమె స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. విసి మాట్లాడు తూ వర్సిటీ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరవుతున్నారని, కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. వర్సిటీలో యూజీ, పీజీ డిగ్రీల కాన్వొకేషన్ కు 1601మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఇందులో పీహెచ్ డి డిగ్రీలు సైన్స్ విభాగంలో 66, సోషల్సైన్స్ విభాగంలో 55 మందికి పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. పీజీలో సైన్స్ విభాగం నుంచి 638 మందికి, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం నుంచి 16మందికి, సోషియల్ సైన్స్ విభాగం నుంచి 286మంది పట్టాలు పొందనున్నారన్నారు. యూజీలో 286 మందికి సైన్స్ విభాగంలోనూ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 576 మందికి, సోషియల్ సైన్సెస్లో 342 మందికి డిగ్రీ పట్టాలు అందకోనున్నారని, అలాగే ప్రతిభ చూపిన విద్యార్థులకు 102మందికి గోల్డ్ మెడల్స్, 23 మందికి బుక్లు, ఏడుగురికి క్యాష్ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. అలాగే స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న హైదరాబాద్ కు చెందిన రిటైర్డ్ డీఆర్డీఓ ప్రముఖ మిస్సైల్ సైంటిస్ట్ శశికళ సిన్హాకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్ ఉషా, ప్రొఫెసర్ అనురాధ, అధ్యాపకులు, పిఆర్వో రజిని పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాల మళ్లింపు

పుంగనూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో ఈనెల 10, 11 వ తేదీల్లో జరగనున్న సుగుటూరు గంగమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని సిఐ సుబ్బరాయుడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలను ఈనెల 10వ తేదీఉదయం 7 గంటల నుండి 12 వ తేది ఉదయం వరకు పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు ఈ విధంగా ఉంటుందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలు తెలిపారు. చిత్తూరు, పలమనేరు వైపు నుండి వచ్చు బారీ వాహనాలు (లారీలు, ట్రక్కులు మొదలైనవి) అన్ని పుంగనూరు పట్టణం లోనికి రాకుండా కనుములో గంగమ్మ గుడి జంక్షన్ నుండి బైపాస్ రోడ్డు ద్వారా భీమ గాని పల్లి జంక్షన్ మీదుగా మళ్లించడం జరుగుతుందని,పలమనేరు వైపు నుండి వచ్చు ఆర్టిసి బస్సులు వాసవి కల్యాణమండపం దగ్గర నుండి న్యూ జె టౌన్ వైపు మళ్లించి అక్కడి నుండి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ మీదుగా పుంగనూరు టౌన్ లోకి అనుమతించబడతాయన్నారు. మదనపల్లి వైపు నుండి పలమనేరు, చిత్తూరు వైపు వెళ్ళు ఆర్ టి సి బస్ లు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ నుండి గోకుల్ సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డ్ మీదుగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్ మీదుగా వెళ్తాయని, ముల్బాగల్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు మాధాన పల్లి మీదుగా పిచ్చిగుండ్ల పల్లి, గూడురు పల్లి దగ్గర పలమనేరు హైవే మీదుగా మళ్ళించడం జరుగుతుందని అన్నారు.ముల్బాగల్ నుండి వచ్చే బస్సులను డాన్ బాస్కో స్కూల్ వరకు అనుమతించడం జరుగుతుందని, చిత్తూరు నుండి వచ్చు ఆర్ టి సి బస్సులను యు ఎన్ ఆర్ సర్కిల్ జంక్షన్ , గోకుల్ సర్కిల్ మీదుగా మదనపల్లె రోడ్డుకు మళ్ళించడం జరుగుతుందని, మదనపల్లి నుంచి వచ్చు ఆర్ టి సి బస్సులను ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా యుఎన్ఆర్ సర్కిల్‌కు మళ్ళించడం జరుగుతుందని, రామసముద్రం నుండి వచ్చే ప్రైవేట్ బస్సులను శు భారం డిగ్రీ కళాశాలవరకు మళ్ళించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ పోలీస్ వారికి సహకరించి శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరను విజయవంతం చేయాలన్నారు.

ఉన్నత విద్యలో గణనీయ మార్పులు : అప్సి చైర్మన్

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్: భవిష్యత్తులో ఉన్నత విద్యలో మార్పులు రాబోతున్నాయని, ఇందుకోసం విశ్వవిద్యాలయాలు, అధ్యాపకులు సన్నద్ధం కావాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి తెలిపారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం మొదటిసారి ఎస్వియూను సందర్శిం చారు. సందర్శన అనంతరం వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ అప్పా రావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలిసి ప్రిన్సిపాళ్లు, డీన్లతో పలు అంశాలపై సమావేశమై చర్చించారు. ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలని, అకడమిక్ క్యాలెండర్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఒకే సారి పరీక్షలు నిర్వహించాలని కోరారు. లా, ఎడ్యుకేషన్, ఫార్మసీ కోర్సుల్లో గత సంవత్సరం ఆలస్యం గా అడ్మిషన్లు జరిగాయని, లోకల్, నాన్ లోకల్ విధానం కోసం సుప్రీం కోర్టు తీర్పు కోసం ఆలస్యమైందని అన్నారు. కృత్రిమ మేధస్సుతో మంచి ఫలితాలు వస్తాయని, అయితే విద్యార్థులతో ముఖాముఖి వుండ దని, ఇది పాఠాలు చెప్పడం ఛాలెంజ్ మారుతున్న దశ అని గుర్తు చేశా రు. పరిశోధనల విషయంలో కొన్ని విశ్వవిద్యాలయాలు కలసి క్లస్టర్ గా ఏర్పడి పరిశోధనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య సుధారాణి, ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య ఓవియస్.రెడ్డి, ఆచార్య శ్రీనివాసులు, డీన్లు ఆచార్య బాలాజీ, ఆచార్య నరసింహ, రమేశ్ బాబు, ఆచార్య రాజేంద్ర ప్రసాద్, ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వం విజయవంతం

శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ సభ్యత్వం కార్యక్రమం దేవస్థానం చైర్మన్, జనసేన పార్టీ నేత కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి జనసేన పార్టీ సభ్యత్వం కొరకు ఉత్సాహంగా యువతీ యువకులు వస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ సభ్యత్వం తీసుకుంటే సంబంధిత వ్యక్తులకు ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ కల్పిస్తామని తెలిపారు. శు క్రవారం శ్రీకాళహస్తి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యమి జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ పరిసర ప్రాంతాల్లోని దుకాణాలను సందర్శిస్తూ ప్రజలకు జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ లక్ష్యాలు, క్రియాశీలక సభ్యత్వం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆసక్తి చూపిన ప్రజలతో జనసేన సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, జయప్రకాష్, మహేష్, గరికపాటి చంద్ర, జానీ భాషా, చిరంజీవి తదితరులు, జనసైనికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞాన వారోత్సవాలు

తడ, మేజర్ న్యూస్: తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల స్థాయిలో విజ్ఞాన వారోత్స వాలను శుక్రవారం ఎంఈఓ-1 వేములు ఆధ్వర్యంలో వహించారు.ఈ వారోత్సవాల్లో భాగంగా మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, ఫ్యాన్సీ డ్రెస్, సెమినార్ నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థుల కు బహుమతులను ప్రదానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు జి హరిత , సైన్స్ ఉపాధ్యాయుడు ప్రకాష్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం

పాకాల, మేజర్ న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాకాల స్థానిక యన్.వి.యన్.పాఠశాలలో మండల విద్యా శాఖాధికారులు బాబ్జి, లింగయ్య అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళల హక్కులు, విజయాలు, సమాజంలో వారి కీలక పాత్రను స్మరించుకోవడం ఎంతో అవసరం. స్త్రీ, పురుష సమానత్వం, మహిళా సాధికారతను ప్రోత్సహిస్తూ, ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం అనే నినాదంతో మహిళలను గౌరవించాలని, వారి కలలను సాకారం చేసుకోవడానికి మద్దతుగా నిలవాలని కోరుతూ ఈ దినోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి మహిళ తనలో ఉన్న శక్తిని గుర్తించి, ముందుకు సాగాలని అన్నారు.

రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ

కుప్పం, మేజర్న్యూస్: మండల పరిధిలోని మిట్ట పల్లి గ్రామ పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ ఆధ్వర్యంలో రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమంను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం,కడ సభ్యులు రామచంద్రన్, క్లస్టర్ ఇంచార్జి హైదర్ వల్లీ, శరవణ, సీనియర్ నాయకులు చలపతి, లీలా వెంకటేష్, యూనిట్ ఇన్ఛార్జ్ సంతోష్, మండల యూత్ అధ్యక్షులు కనకరాజు,పంచాయతీ పార్టీ అధ్యక్షులు మంజు, తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

– గ్రామాభివృద్ధికి సహకరించండి: ఎంపీడీవో శేఖర్ నాయక్

తడ, మేజర్ న్యూస్: మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి గ్రామపంచాయతీలన్నీ స్థానిక ప్రభుత్వాలు కాబట్టి స్థానిక ప్రభుత్వాలు ప్రజల యొక్క మౌలిక వసతులు అయినా మంచినీటి సరఫరా, వీధిదీపాలు నిర్వహణ, రోడ్లు మరమ్మత్తులు, పారిశుధ్య నిర్వహణకు నిధులు అవసరము. గ్రామపంచాయతీ ప్రధాన ఆదాయం ఇంటి పన్నులు కావున ప్రతి ఇంటి యజమాని గ్రామపంచాయతీకి ఇంటి పన్నులు చెల్లించి గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో శేఖర్ నాయక్ కోరారు. ఎవరైతే ఇంటి పనులు కట్టరో వాళ్లు ఇంటి ముందర పంచాయతీ సిబ్బంది నిరసన వ్యక్తం చేస్తారని, ఇంటి ముందు డప్పు వాయిస్తారన్నారు. అప్పుడు కూడా ఇంటి పన్ను చెల్లించకపోతే లోకాయుక్తలో కేసు వేస్తారన్నారు. ఆ ఇంటి కి గ్రామపంచాయతీ నుండి అందే సౌకర్యాలను నిలిపేస్తారన్నారు. కావున ప్రతి ఒక్క పంచాయతీలోని ఉన్న గ్రామాలలోని ప్రజలు పంచాయతీ అధికారులకు సహకరించి ఇంటి పన్నులు తప్పకుండా కట్టాలన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

తిరుపతి రూరల్, మేజర్న్యూస్: తిరుపతి రూరల్ మండలం ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం రేపు ఆదివారం ఉదయం ఎంపీడీవో కార్యాలయం నందు జరుగునున్నట్లు రూరల్ మండలం ఎంపీడీవో మస్తాన్ వల్లి తెలియజేశారు. ఈ సమావేశానికి ప్రజాప్రతి నిధులు అధికారులు హాజరవ్వాలని ఆయన కోరారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన యాసీన్

శాంతిపురం, మేజర్న్యూస్: బెంగళూరులోని జక్కూర్ ఏరోడ్రంకు గురువారం విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలశీ ఎం కె పురం గ్రామానికి చెందిన శాంతిపురం మైనారిటీ నాయకుడు యాసిన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధిపై పలు అంశాలను జగన్మోహన్ రెడ్డికి తెలియజేశారు.

టాటా సంజీవిని కార్యక్రమంపై అవగాహన సదస్సు

కుప్పం,మేజర్ న్యూస్ : మండల పరిధిలోని బ్రాహ్మదేవరచేను పంచాయతీలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ ఆధ్వర్యంలో టాటా సంజీవిని కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు అనంతరం కెఎస్సెస్ సమావేశం, పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నాయకులు పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కూడా విస్తృతంగా చర్చించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక నాయకులు, కెఎస్సెస్ సభ్యులు సమయపాలన పాటిస్తూ సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను పూర్తి చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడ నెంబర్ రామచంద్రన్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించలేదని తాగునీరు బంద్

– బియ్యం పల్లి గ్రామస్తుల ధర్నా

శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: పట్టణంలోని బి.య్యంపల్లిలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ అధికారులు ఇంటి పన్ను సకాలంలో చెల్లించలేదని తాగునీరు బంద్ చేశారు. ఈ సందర్భంగా బియ్యం పల్లి గ్రామస్తులు రహదారికి అడ్డంగా ధర్నా, నిరసన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి శాంతింప చేశారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు చింతా రజేంద్ర మాట్లాడుతూ దళిత వాడ పట్ల మున్సిపల్ కమిషనర్, మునిసిపాల్ అధికార యంత్రాంగం అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని, ఇంటి పన్నులు చెల్లించలేదనే నెపంతో బియ్యం పల్లి వాడకు తాగునీరు సరఫరా నిలిపివేయడం సరైనది కాదని కోరారు. పట్టణమంతా తాగునీటి సరఫరా సజావుగా సాగుతుండగా కేవలం బి.యం పల్లి దళితవాడల్లో నీటిని సరఫరా చేసే పైప్ లైన్ వాల్వ్ తీసుకెళ్ళి, నీటి సరఫరాను నిలిపివేయడం మున్సిపల్ కమిషనర్ యొక్క అప్రజాస్వామిక ధోరణికి నిదర్శనం అని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతా రాజేంద్ర పేర్కొన్నారు. పన్నుల వసూలు పేరుతో దళితుల పైనే కక్ష సాధింపు చర్యలకు దిగడం నాగరిక సమాజంలో ఆమోదయోగ్యం కాదని, ఇది ముమ్మాటికీ దళితులపై జరుగుతున్న సామాజిక వివక్షే అని ఆవేదన వ్యక్తం చేశారు. బిఎం పల్లి శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి పైన మహిళలు బయటాయించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాలకు రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ నాగరాజు తన సిబ్బంది, టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు ఒకటవ వార్డుకు చేరుకుని బిఎం పల్లె వాసులు సమస్యలను పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ తో చరవాణి ద్వారా మాట్లాడి తాగునీరుని కాలనీవాసులు అందించారు.

గుడిపాల పీహెచ్‌సీ సేవలపై డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

గుడిపాల, మేజర్న్యూస్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.టి. సుధారాణి శుక్రవారం గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, డాక్టర్లు, సిబ్బంది హాజరు, ఔషధాల అందుబాటు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ఇటీవల ప్రవేశపెట్టిన డిజిటల్ నర్స్ సెంటర్, సంజీవిని కార్యక్రమం అమలు విధానాన్ని సమీక్షించారు. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి చికిత్స ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ ద్వారా రోగుల వివరాలు నమోదు చేసి స్టాఫ్ నర్స్ వద్దకు పంపించడం, అక్కడ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించడం, అనంతరం డాక్టర్ పరీక్షించి అవసరమైన రక్త పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించడం వంటి విధానాన్ని పరిశీలించారు. పరీక్షల అనంతరం రోగులు తిరిగి డాక్టర్ వద్ద చూపించుకుని ఫార్మసిస్ట్ వద్ద నుంచి అవసరమైన మందులు పొందే విధంగా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావాలని డిఎంహెచ్ఓ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు అందించే ఆరోగ్య సేవలను 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల ద్వారా గర్భిణీలు ఆరోగ్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అనూష, స్థానిక డాక్టర్ సంధ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి, నేరేడు చెట్లు

– సాయం అందించాలని కోరుతున్న రైతులు

పాకాల, మేజర్న్యూస్: గుర్తు తెలి యని వ్యక్తులు అగ్గి పెట్టడంతో పాకాల మండలం గాదంకి గ్రామంలోని ఓ రైతుకు చెందిన సుమారు నాలుగు ఎకరాల్లోని మామిడి చెట్లు, నేరేడు చెట్లతో పాటు బోరు మోటారు కాలిపోయిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాకాల మండలం గాదంకి గ్రామానికి చెందిన రైతులు రెడ్డెప్ప, రెడ్డెమ్మ లు సుమారు ఐదు ఎకరాల్లో 30 యేండ్ల వయిస్సు కలిగిన మామిడి చెట్లు, మూడు సంవత్సరాల నేరేడు, జామ, ఉసిరి చెట్లు సాగు చేస్తున్నారు. అయితే గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. రాత్రి సమయం కావడంతో ఎవరూ గుర్తించక పోవడంతో మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. దీంతో మామిడి, నేరేడు, ఉసిరి, జామ, టేకు, ఎర్ర చందనం చెట్లతో పాటు బోరు మోటారు కాలిపోయాయి. దీంతో రైతులు లేబోదిబో మంటున్నారు. గాదంకి వి.ఆర్.వో. కు సమాచారం అందిచడంతో ఆయన అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులను ఆదికోవాలని కోరుతున్నారు.

యూజీ పరీక్షల ఫీజు 21లోపు చెల్లించాలి

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్: ఎస్వీయూ పరిధిలో వచ్చేనెలలో జరగనున్న యూజీ నాల్గవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి పరీక్షల ఫీజును ఈనెల 23వ తేదీలోపు విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000ల అపరాధ రుసుముతో ఈనెల 23తో గడువు ముగుస్తుందని తెలియజేశారు.

–డీడీఈ పీజీ ఫలితాలు విడుదల: ఎస్వీయూ డీడీఈ విభాగం పీజీ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డీన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణ అధికారి డా. రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

– ఆటో ను ఢీకొన్న స్కూల్ బస్సు

– ఒకరు మృతి–మరొకరి పరిస్థితి ఆందోళనకరం

చంద్రగిరి, మేజర్ న్యూస్: పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు ఆందోళనకరంగా మారింది. చంద్రగిరి పోలీసుల కథల మీదకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా పులిచెర్ల మండలం పుచ్చల వారి పల్లి సమీపంలోని రాయలవారిపల్లి గ్రామానికి చెందిన చంద్రబాబు, చంగల్ రాయలు అనే వ్యక్తులు సొంత పనుల మీద ఆటోలో తిరుపతికి వస్తున్నారు. చంద్రగిరి మండలం చంద్రగిరి పట్టణానికి సమీపంలోని సర్వీస్ రోడ్డులో నాగాలమ్మ మలుపు వద్ద అతివేగంగా ఆటో నడుపుతుండడంతో ఎదురుగా ఒక ప్రైవేటు స్కూలు, బస్సు లారీ వచ్చాయి. స్కూల్ బస్సు ఆటోను ఢీకొనండి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రాయలవారిపల్లికి చెందిన చంద్రబాబు, చంగల్రాయులకు తీవ్ర గాయాలయ్యాయి. చంద్రబాబుకు అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చంగల్రాయులను 108 ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రుయాలో చికిత్స పొందుతున్న చెంగల్ రాయల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్ల వైద్యులు తెలిపారు. చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం తిరుపతి శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలకు తరలించారు.

'ఉద్యమి'పై ఆసక్తి చూపుతున్న యువత

(మొదటిపేజీ తరువాయి)

జనసేన పార్టీ సభ్యత్వం స్వీకరించేందుకు యువతతో పాటు ఇరవై ఒక్క సంవత్సరం నిండిన ప్రతి ఒక్కరూ ఆసక్తి కనబరుస్తున్నారు. సభ్యత్వం స్వీకరించిన యువతకు పార్టీ కమిటీ పదవులలో బాధ్యతలు అప్పగించడం, నాయకత్వపు బాధ్యతలు అప్పగించేందుకు ఇది ఒక మంచి సదవకాశం.

మేజర్‌న్యూస్: తిరుపతి నగరంలో జనసేన పార్టీ బలం పెరగనుందా..?

రాజారెడ్డి : తెలుగుదేశం, బిజెపి జనసేన కూటమి పార్టీలు కలవడంతోనే నాయకులు కార్యకర్తలు అందరూ సమిష్టిగా పనిచేయటంవల్ల జనసేనపార్టీ అభ్యర్థి అరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గతంలో కంటే ఈ ఏడాది జనసేన పార్టీకి నగరంలోని అన్ని డివిజన్లలో జనసేన సభ్యత్వం స్వీకరించేందుకు ప్రజలలో మంచి స్పందన ఉంది. ఇప్పటికే 50 డివిజన్లకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి జనసేన పార్టీ

సభ్యత్వం స్వీకరించటం వల్ల కలిగేఉపయోగాలు, సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతోంది.

మేజర్‌న్యూస్: ఇప్పటివరకు ఎన్ని వేల సభ్యత్వాలు పూర్తి చేశారు..?

రాజారెడ్డి: తిరుపతి నగరంలోని 50డివిజన్లో ఇప్పటివరకు 9500కు పైచీలకు పైగా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి అయింది. గత నెల 26వ తేదీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ మూడు రోజులపాటు సాంకేతిక కారణాల వల్ల కొద్దిగా జాప్యం జరిగింది. ఏది ఏమైనా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడానికి తిరుపతి నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.

పదో తేదీ వరకు సభ్యత్వ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

మేజర్‌న్యూస్: క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి ఏమేమి ఉపయోగాలు..?

రాజారెడ్డి: జనసేన పార్టీ ఉద్యమి క్రియాశీలక సభ్యత్వం స్వీకరించిన కార్యకర్తలకు ఐదు లక్షల ప్రమాద భీమా, స్వల్ప ప్రమాదాలకు గురైతే 50 వేల రూపాయలు, తీవ్రత ఎక్కువగా ఉంటే రెండు లక్షల వరకు భీమా సౌకర్యం .

నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత. పార్టీ పదవులలో నాయకత్వపు బాధ్యతలను అప్పగించేందుకు సభ్యత్వం ఉన్నవారికి ప్రాధాన్యత.

మేజర్‌న్యూస్: జనసేన పార్టీలో సాదికి సభ్యులు అంటే ఎవరు..?

రాజారెడ్డి: జనసేన పార్టీ బలోపేతానికి, కొత్తవారిని ప్రభావితం చేస్తూ నవతరం లో ప్రేరణ కలిగించి పార్టీలోకి ఆహ్వానిస్తూ సభ్యత్వాలు చేయించే వారిని సాదికి సభ్యులుగా గుర్తించడం. వారే కాకుండా జనసేన పార్టీకి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీకి ప్రత్యక్షంగా పరోక్షంగా ఆర్థిక సాంకేతిక మేధోపరమైన సహకారం అందిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేసే వారిని ప్రదాత సభ్యులుగా గుర్తించడం జరుగుతుంది.

మేజర్‌న్యూస్: పదో తేదీల్లోగా ఎన్ని వేల సభ్యత్వాలు చేయించడం మీ లక్ష్యం.

రాజారెడ్డి: ఈనెల 10వ తేదీల్లోగా 25 వేల పైచేలకు పైగా 30 వేల లోపు మీ క్రియాశీలక సభ్యత్వం చేయించడమే లక్ష్యంగా తిరుపతి నియోజకవర్గంలో జనసేన పార్టీలో ప్రతి ఒక్కరు పని చేస్తున్నారు. ఏది ఏమైనా జనసేన పార్టీ విధి విధానాలను నచ్చి యువత ఎక్కువగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం స్వీకరించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో జనసైనికులు ముందుండి పూర్తి సహాయ సహకారాలు అందించడమే తమ పార్టీ విధి విధానాల లక్ష్యమని జనసేన పార్టీ నగర అధ్యక్షులు రాజారెడ్డి తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్: మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. మహిళా సాధికారత భావనకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే పోలీసు శాఖలోని మహిళా విభాగాన్ని కూడా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ముందస్తు ప్రణాళిక సమావేశాలు నిర్వహించి, ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇటీవల ఆమోదం పొందిన 10 వన్‌స్టాప్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నందున, వాటిని వర్చువల్ ద్వారా వీక్షించేలా సరైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళల కోసం అందుబాటులో ఉన్న 112 టోల్ ఫ్రీ సేవలు, వన్ స్టాప్ సెంటర్ సేవలు, డీవీ సెల్, ప్రసూతి సేవలు వంటి అంశాలపై జిల్లా కేంద్రాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు సీఐ తిమ్మయ్య

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:

శ్రీకాళహస్తి పట్టణం పెళ్లి మండపం వద్ద సీఐ తిమ్మయ్య, ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమో చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఆర్.సి, పొల్యూషన్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపిల్లలు ద్విచక్ర నడుపుతున్న వారికి అవగాహన కల్పించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మునస్వామి నాయుడు, కానిస్టేబుల్లు వెంకటేష్ రెడ్డి, హేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శేషాచల అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

తిరుమల, మేజర్‌న్యూస్: తిరుమల శేషాచల అటవీ ప్రాంతంలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. తిరుమలకు 5 కిలోమీటర్ల దూరంలోని కాకులమాను కొండ అటవీ ప్రాంతంలో పవన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సమీపంలోనే అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత అంతకంతకు పెరుగుతూ ఉండగా శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు చెలరేగిన ప్రాంతం పక్కన పవన్ విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రం ఉండడంతో మంటలు ఆ వైపునకు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో పెనుప్రమాదం తప్పింది.

టీటీడీ ఈఓగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

తిరుమల, మేజర్‌న్యూస్: ముద్దాడ రవిచంద్ర శ్రీవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు టీటీడీ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపుఈఓ వెంకయ్య చౌదరి వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు ఈవో మీడియాతో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. శ్రీవారి భక్తులకు సాటి భక్తుడిగా సేవ చేస్తానని చెప్పారు.భక్తుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో భక్తులకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

-కోట - వాకాడును రెండు చేయడం కరెక్ట్ కాదు
-మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మెహన్

కోట, మేజర్ న్యూస్ : గూడూరు నియోజకవర్గం రెండు చేయడం, కోట – వాకాడు మండలంలో విడగొట్టడం కరెక్ట్ కాదని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కోటలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఆవరణములో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోట, వాకాడు రామ లక్ష్మణ్ లాగా కలిసి ఉండేవి అన్నారు. ఒకవైపు దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మరో వైపు దివంగత నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ఇద్దరు కలసి ఈ ప్రాంతాన్ని ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇది కేవలం రాజకీయ దురుద్దేశంతోనే కోటవాక ఆందోళన విడగొట్టడం జరిగిందన్నారు.ముగ్గురు బిడ్డలను పుట్టించాలని చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై చింతామోహన్ కౌంటర్ ఇచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పేదొకటి, చేసేదొకటి. ఆయన మాటలకు చేతలకు పొంతన ఉండదని చింతామోహన్ పేర్కొన్నారు. జనాభా పెంచేందుకు అసెంబ్లీలో ప్రతి ఒక్కరూ ముగ్గురు బిడ్డల్ని పుట్టించాలని చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై చింతామోహన్ స్పందించారు. తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు నాయుడు తెలివిగా ఒకే బిడ్డను కన్నాడు. (లోకేష్) పోనీ ఆయన కొడుకు లోకేష్ ఏమైనా ముగ్గురు బిడ్డలను పుట్టించారా అంటే లేదు. అతను కూడా ఒక కొడుకునే కన్నాడు. మీ ఇంట్లో ముగ్గురు బిడ్డల్ని పుట్టించి, ప్రజలకు చెప్తే ఆమోదయోగ్యంగా ఉంటుందని, ప్రజలందరూ ఆచరిస్తారని తెలిపారు. జనాభా పెరుగుదల గురించి అసెంబ్లీ వేదికగా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగానూ, హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.దుగరాజపట్నం ఓడరేవుకు ఎనిమిది వేల కోట్ల రూపాయలు రావాలి. మేజర్ పోర్టు, ప్రభుత్వ పోర్టు వస్తే, లక్ష రూపాయలు జీతాలు ఇచ్చే ఉద్యోగాలు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం నౌకాశ్రయం నిర్మాణం పేరుతో, రెండు వేల ఎకరాలు పేదల భూములు లాక్కుందన్నారు. 100 ఎకరాలు నౌకాశ్రయం నిర్మాణానికి సరిపోతుందన్నారు. ఎవరి ప్రయోజనాలను కాపాడడం కోసం రెండు వేల ఎకరాలు పేదల భూములు గుంజుకున్నారని నిలదీశారు. చంద్రబాబు నాయుడు నేను నిజాయితీపరుడునని , నాకు బంధుప్రీతి లేదు అంటాడు. ఎన్టీఆర్ మనవడికి సిలికాన్ ఇచ్చారు. నీ బంధుప్రీతి కాదా? ఎన్టీఆర్ మనవడు నిరుపేదనా? నిరుద్యోగా? అని ప్రశ్నించారు. సిలికాన్ లో సిండికేట్ పేర్లు చెప్పే దమ్ము చంద్రబాబు నాయుడుకు ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. సిలికాన్ లో ప్రతినెలా 14 కోట్ల రూపాయలు ముడుపులు తీసుకుంటున్నారని చింతామోహన్ ఆరోపించారు. ఎస్సీలు, ఓబీసీలు, ఎస్టీలకు సిలికాన్, ఇసుకలో కోట ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయుడుపేటలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఇసుకను తోలుకుంటున్నారని, డబ్బు సంపాదిస్తున్నారని, నిరుద్యోగులైన, ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు ఇసుక, సిలికాన్ లో వాటా ఇవ్వాలని స్పష్టం చేశారు. 15 రోజుల్లో దీనిపై స్పష్టత రాకుంటే, మా వాళ్లే వచ్చి ఇసుక, సిలికాన్ తోలుకుంటారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేసులకు భయపడబోమని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మీజురు మాధవ్, కాంగ్రెస్ నాయకులు గాడి వెంకటయ్య, చందనమూడి శివ, సుధాకర్, చిన్నం క్రిష్ణయ్య, శంకర రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

– ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాల సేకరణ

కుప్పం, మేజర్ న్యూస్: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డ్‌లోని 167వ బూత్‌లో కె ఎస్ ఎస్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వన్యాకుల క్షత్రియ స్టేట్ డైరెక్టర్, యూనిట్ ఇంచార్జి వేణుగోపాల్, యువ నాయకులు బూత్ ఇంచార్జ్ లోకేశ్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాలు ప్రజలకు ఎలా అందుతు న్నాయో తెలుసుకోవడం కోసం ఈ కార్యక్రమం నిర్వహి స్తున్నామని తెలిపారు. ప్రజల సూచనలు, సమ స్యలను తెలుసుకుని వాటిని సంబంధిత అధి కారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. ప్రభు త్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, ప్రతి కుటుంబానికి వాటి ప్రయోజనాలు చేరేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బొమ్మసముద్రం కూడలిలో వెలుగులు... ప్రజల్లో ఆనందం

– కూటమి ప్రభుత్వంతో అభివృద్ధిలోకి
బాట ఎంపీపీ గోళ్ళ హరి ప్రసాద్

గుడిపాల, మేజర్‌న్యూస్: మండలంలోని మరకాల కుప్పం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డు కూడలిలో గత కొంతకాలంగా ఫోకస్ లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి కారణంగా రాకపోకలు కూడా కష్టంగా మారాయి. ఈ సమస్యను స్థానిక ప్రజలు గుడిపాల ఎంపీపీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీపీ హరిప్రసాద్ చౌదరి సమస్యను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు తెలియజేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డు కూడలిలో ఫోకస్ లైట్లను ఏర్పాటు చేయించారు. దీంతో ఎన్నో రోజులుగా చీకటిలో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఉపశమనం లభించింది. లైట్ల ఏర్పాటు తర్వాత కూడలి ప్రాంతం వెలుగులతో కళకళలాడుతోంది. రాత్రి వేళల్లో రాకపోకలు సులభంగా మారాయని గ్రామస్థులు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీపీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, స్థానిక సర్పంచ్ ప్రసాద్ రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ అనిల్ కుమార్ చౌదరి,, పంచాయతీ తెలుగు దేశం పార్టీ నాయకులు, మండల ఉపాధ్యక్షుడు ధనసింగ్, రైతు నాయకుడు మునిరత్నం యాదవ్, బీసీ నేత దొరబాబు యాదవ్, మార్కొండ యాదవ్, సురేష్, నాగేంద్రపురం సురేష్, ఆన్బా, చందు, చల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తు కోసం ఉత్తమ కోర్సులు ఎంచుకోండి

– శ్రీకాళహస్తి యువతరం సేవా సమితి

శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని, సరైన దిశలో అడుగులు వేస్తేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని యువతరం సేవా సమితి సభ్యులు అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణం తెలుగు గంగ కాలనీలో గల గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 63 మంది, రాజీవ్ నగర్‌లో ప్రతిభ పాఠశాల 20 మంది పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. పది తర్వాత ఇంటర్మీడియట్ తో పాటు పాలిటెక్నిక్, ఐటిఐ వంటి వృత్తి విద్యా కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం మార్కులే కాకుండా, సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఉండే వివిధ ఉన్నత విద్యా అవకాశాలు, ప్రవేశ పరీక్షల గురించి వివరించిన 'కెరీర్ గైడెన్స్' కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలి. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అండగా ఉండటమే మా సమితి ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు, యువతరం సేవా సమితి సభ్యులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లిలో గుడిసెలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్: మండలంలోని ఎల్లంపల్లి ఎస్టి లకు ఇట్టి స్థలాలు వెంటనే ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి కాలనీలో జనాభా పెరుగుదల కారణంగా ప్రభుత్వ అధికారులు సర్వే చేసి ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న అధికారుల మారుతున్న యానాదుల బాధలను పరిష్కరించే అధికారులు లేరని మండిపడ్డారు స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్న ఈనాటికీ ఎస్ టి ఎస్ సి లకు ఉండడానికి గూడు తినడానికి తిండి లేక ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక ఎండిన డొక్కలతో వ్యవసాయ కూలీలు ఉపాధి కూలీలు నాన్న ఇబ్బందులు గురవుతున్న పట్టించుకోవలసిన అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని డిమాండ్ చేశారు. కూలికిపోతే కానీ కుటుంబం గడవదని కూలిక పోకపోతే ఆరోజు మొత్తం ఆకలితో అల్లాడుతారు అని మండిపడ్డారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఎల్లంపల్లి యానాదులు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంగలరాయిలు, బత్తయ్య, శివమ్మ, కృష్ణయ్య, అమ్ములు, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టిబి వ్యాధిని పూర్తిగా నయం చేయగలిగే చికిత్స ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉంది

- ప్రపంచ టిబి దినోత్సవం - ముందస్తు అవగాహన

కుప్పం, మేజర్ న్యూస్: ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 24వ తేదీ నాడు నిర్వహించనున్న కార్యక్రమాల నేపథ్యంలో కుప్పంలో ముందస్తు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమం కుప్పం ఆర్‌టీసీ బస్టాండ్ కూడలిలో నిర్వహించగా, చిత్తూరు జిల్లా టిబి నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో, పి.ఇ.ఎస్ మెడికల్ కాలేజీ సహకారంతో జిల్లా టిబి కంట్రోల్ అధికారి డా. వెంకట ప్రసాద్, కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా టిబి కంట్రోల్ అధికారి డా. వెంకట ప్రసాద్ మాట్లాడుతూ టిబి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దగ్గు రెండు వారాలకంటే ఎక్కువ కాలం కొనసాగితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. టిబి వ్యాధిని పూర్తిగా నయం చేయగలిగే చికిత్స ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే టిబి వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం పలు పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నదని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి పోషకాహార భత్యంగా నెలకు రూ.1000 చొప్పున ఆరు నెలల పాటు రూ.6000 అందజేస్తున్నట్లు వివరించారు. టిబి రోగులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు తీసుకుంటే పూర్తిగా నయం అవుతారని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో పి.ఇ.ఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు డా. ఉమ, డా. ధృవకుమార్, నర్సింగ్ విద్యార్థులు, ఎన్‌టీఈపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా నీలగిరి చెట్ల నరికివేత
చెట్ల నరికివేత ను అడ్డుకున్న చుట్టుపక్కల గ్రామస్తులు

శాంతిపురం మేజర్ న్యూస్: శాంతిపురం మండలం సాతు రెవిన్యూ లోని పాత సర్వే నెం. 83/2ఈ ఎల్ పి నెంబర్ 91 విస్తీర్ణం 4 ఎకరాల 94 సెంట్లు గాగల అనాధీనం లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమి లోని కర్పూరం చెట్లు (యూకలిప్టస్ వృక్షాలు) రాళ్ళబూదుగూరు కు చెందిన కట్టెల వ్యాపారి అనధికారికంగా వృక్షాలను తొలగించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పక్క గ్రామస్తులు అక్కడికి చేరుకుని సదురు వ్యక్తిని ప్రశ్నించగా 2 లక్షల రూపాయలు నగదును అధికారులకు చెల్లించి అనుమతిని పొందానని అక్కడ వచ్చిన గ్రామస్తులకు తెలియజేశారు. సుమారు 5 ఎకరాల విస్తీర్ణం లోని చెట్లకు కేవలం 2 లక్షలు చెల్లించడమేమిటని ఆశ్చర్య పడిన గ్రామస్తులు ఈ విషయంపై రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులను విచారించగా అలాంటిది ఏదీ లేదని తెలిపినట్టు సమాచారం. అనంతరం స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి కే వై శివ శంకరయ్య అక్కడికి చేరుకుని చెట్లు నరికివేతను అడ్డుకున్నాడు. నరికిన వృక్షాలను ఇక్కడే వదిలి అధికారుల వద్ద పొందిన అనుమతి పత్రము నగదు చెల్లించిన రసీదులు పంచాయతీ కార్యాలయానికి తీసుకు వచ్చి చూపించాలని తెలిపి కార్యదర్శి కార్యాలయానికి చేరుకున్నారు. ఎంతసేపటికి కట్టెల వ్యాపారి అనుమతి పత్రాన్ని నగదు చెల్లించిన రసీదును పంచాయతీ కార్యాలయానికి తీసుకురాలేదు, ఫోనులో కూడా అందుబాటులోకి రాలేదు. తిరిగి కార్యదర్శి ఘటన స్థలానికి చేరుకునే లోపే సుమారు 80 శాతం చెట్లను నరికి అక్కడున్న చెట్లను వాహనాలను కూలీలు అక్కడి నుండి మాయం చేశాడు. ఈ విషయంపై స్థానిక విఆర్ఓ శ్రీనివాసులను వివరణ కోరగా గ్రామస్తులు ఈ విషయం ఈ సంఘటనపై సమాచారం అందించాలని ప్రదేశాన్ని పరిశీలించి పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ సంఘటనపై సాథు మరియు రెడ్డివారిపల్లి గ్రామస్తులు ఇలాంటివి ఈ మధ్యన చాలా ఎక్కువైనట్టు రోడ్డు పక్కన చెట్లు రాత్రి కి రాత్రే మాయమైతున్నట్టు ప్రజాధనాన్ని కొందరు దోచుకుంటున్నట్టు తెలిపారు.

గంగ జాతర ఏర్పాట్లపై అధికారులతో సమావేశమైన సబ్ కలెక్టర్

పుంగనూరు మేజర్ న్యూస్: పట్టణంలోని ఎం ఆర్ ఓ కార్యాలయం నందు శుక్రవారం సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి గంగ జాతర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గంగ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి ఎమ్మార్వో రాము సిఐ సుబ్బరాయుడు ఆర్ ఐ పనింద్ర కరెంట్ ఏఈలు మున్సిపల్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలతో కస్టమర్ల నమ్మకాన్ని పొందాలి

మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

-నాయుడుపేటలో వైభవంగా 'కుబేర జువెలరీస్' ప్రారంభోత్సవం

నాయుడుపేట,మేజర్ న్యూస్: నాయుడుపేట పట్టణంలోని ఆంధ్ర బ్యాంక్ వీధిలో అత్యంత నాణ్యత ప్రమాణాలతో నూతనంగా ఏర్పాటు చేసిన 'కుబేర జువెలరీస్' గోల్డ్ షాపును శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం , యువ నాయకులు నెలవల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి నూతన గోల్డ్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లోని బంగారు ఆభరణాల డిజైన్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవ్యాపార రంగంలో కస్టమర్ల నమ్మకం, విశ్వాసం చాలా ముఖ్యం. కుబేర జువెలరీస్ వారు అత్యుత్తమ నాణ్యతతో కూడిన సేవలు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలి. ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఆకాంక్షించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం గారు కూడా షాపు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆభరణాలు అందుబాటులోకి రావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి, సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కె.ఆర్.ఆర్ యువసేన సభ్యులు అజయ్, లోకేష్ రెడ్డి,బొల్లాకాయల అక్షయ్, కొండూరు వెంకట్ అక్షయ్, ఎల్లంటి చరణ్ రెడ్డి, వినోద్, తిక్కబత్తిన వినోద్ కుమార్, ఉగుముడి సోమశేఖర్ మరియు షాపు యాజమాన్యం, పట్టణంలోని పలువురు పాల్గొన్నారు.

రైతులకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

కురుగొండ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ దార అంకయ్య

-రైతుల సొమ్ముకు రక్షణ ఉండాలిసొసైటీ అభివృద్ధి పథంలో నడవాలి

-నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

ఓజిలి,మేజర్ న్యూస్: రైతులకు సేవ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు కురుగొండ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ దార అంకయ్య పేర్కొన్నారు.ఓజిలి మండలంలోని కురుగొండ సహకార సంఘం సొసైటీసిబ్బందికి సొసైటీ అధ్యక్షులు డాక్టర్ దార అంకయ్య కఠిన ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిబ్బంది పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు.రైతులు తమ అవసరాల కోసం వచ్చినప్పుడు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.కార్యాలయ పని వేళల్లో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని, విధుల్లో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.క్షేత్రస్థాయిలో రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత సిబ్బందిపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు. లి-రైతు సంక్షేమమే మా ప్రాధాన్యత.లి విధులను సక్రమంగా నిర్వహించని వారిని, రైతులను ఇబ్బంది పెట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదు" అని ఆయన ఈ సందర్భంగా తేల్చి చెప్పారు.

-సొసైటీ రికార్డులు పక్కాగా ఉండాలి: తీవ్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. సొసైటీలో పారదర్శకతను పెంచేందుకు, సిబ్బందిలో జవాబుదారీతనం తీసుకువచ్చేందుకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రతి నెల తప్పనిసరిగా మీటింగ్‌కు హాజరు కావాలని, ఆ నెలలో జరిగిన కార్యకలాపాలపై చర్చించాలని సిబ్బందిని ఆదేశించారు.సొసైటీకి సంబంధించిన ప్రతి రికార్డు పక్కాగా ఉండాలని, ఎటువంటి తప్పులకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు.సొసైటీలో జరిగే ప్రతి ఒక్క రూపాయి లావాదేవీకి జవాబుదారీగా ఉండాలని, పూర్తిస్థాయి లెక్కలను ఎప్పటికప్పుడు చూపాలని పేర్కొన్నారు.సొసైటీకి ఎంత లాభం వస్తోంది? ఎక్కడైనా నష్టం వాటిల్లుతుందాఅనే వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు.సిబ్బంది చేసే చిన్న పొరపాటు వల్ల ప్రభుత్వానికి ఎలాంటి చెడ్డ పేరు వచ్చినా ఊరుకునేది లేదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు.

యుద్ధాన్ని వెంటనే ఆపండి.. ప్రపంచ శాంతి కాపాడండి

- ఐక్య రాజ్యసమితి జోక్యం చేసుకోవాలి

పలమనేరు మేజర్ న్యూస్ : ఇరాన్ తో అమెరికా ఇజ్రాయెల్ దేశాలు తలపడుతూ యుద్ధం కొనసాగిస్తున్న నేపథ్యంలో వేలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని తక్షణం యుద్ధం ఆపేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యంచేసుకోవాలని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజన్ పేర్కొన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ పుంగనూరు నియోజకవర్గ కమిటీ ని, అన్నమయ్య జిల్లాలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం భగత్ సింగ్ కాలనీలో రామ్మూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి మహేష్, చిత్తూరు జిల్లా సహాయ కార్యదర్శి టీ. జనార్దన్ లు హాజరయ్యారు. సమావేశం తొలుత ఇరాన్- అమెరికా ఇజ్రాయిల్ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్న పలువురు అమాయక ప్రజలకు సంతాపం తెలియజేసింది. అనంతరం జరిగిన సభలో నాగరాజు మాట్లాడుతూ.... ఒకనాడు అలీన దేశాలకు ప్రపంచ శాంతికి కేంద్ర బిందువుగా ఉన్న భారత ప్రభుత్వం యుద్ధాన్ని నివారించేందుకు ఒక దేశ అధ్యక్షుడిని మట్టు పెడితే ఖండించేందుకు గాని పూనుకోక పోవడం దుర్మార్గమన్నారు. యుద్ధం నివారించకపోతే అణుయుద్ధంగా రూపాంతరం చెంది ప్రపంచ మానవాళికే ముప్పు వాటిల్లుతుందనే విషయం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఐక్యరాజ్యసమితి సత్వరం జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.సిపిఐ అన్నమయ్య జిల్లా సెక్రెటరీ పి.మహేష్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ పాలనకు భిన్నంగా ఏమీ వ్యవహరించడం లేదని ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నారని విమర్శించారు. ప్రజా ఉద్యమాలను అణచి వేయాలనుకుంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు,టిడ్కోఇండ్లు, ఇంటి స్థలాలు కేటాయించడంలో జరిగే జప్యంపై ఉద్యమించాలని తెలిపారు.రాష్ట్రం విద్య వైద్యం పూర్తిగా ప్రైవేటుపరం చేస్తున్నారని కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు.ఈ నేధ్యంలో పార్టీ ఉద్యమం బలోపేతం చేసేందుకు నిర్మాణం కోసం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తూ నిధులు వసూలు చేసేందుకు కృషి చేయాలని పిలుపిచ్చారు. సమావేశానికి పుంగనూరు సహాయ కార్యదర్శి మున్నా స్వాగతం పలకగా ఏఐటియుసి కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి పునాది

మండల విద్యాశాఖ అధికారిణి శైలజా

-ఓజిలిలో అంగన్‌వాడీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

-అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు హిమజ, డేనియల్

ఓజిలి,మేజర్ న్యూస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, ఓజిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మణెమ్మ , అంగన్వాడి టీచర్ శ్యామల ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు వేడుకలను నిర్వహించారు. మహిళా సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారిణి శైలజ , వైద్యులు డాక్టర్ హిమజ మరియు డాక్టర్ డేనియల్ హాజరయ్యారు. మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మరియు ఇతర సిబ్బందికి వైద్యులు హిమజ, డేనియల్ ప్రత్యేకంగా హెల్త్ చెకప్‌లు నిర్వహించారు. మహిళలు విధులతో పాటు తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని, పోషకాహారం తీసుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు.మండల విద్యాశాఖాధికారి శైలజా మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, అంగన్‌వాడీ సిబ్బందికి ఇలాంటి వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. వైద్యులు డాక్టర్ హిమజ మాట్లాడుతూ మహిళలు ఇంటి బాధ్యతలు, విధులతో సతమతమవుతూ తమ సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు క్షేత్రస్థాయిలో ఎంతో కష్టపడుతుంటారు. ప్రతి మహిళా క్రమం తప్పకుండా రక్త పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేయించుకోవాలి. రక్తహీనత బారిన పడకుండా పోషకాహారం తీసుకోవాలి. ఆరోగ్యవంతురాలైన మహిళే ఆరోగ్యవంతమైన కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్యామల, స్వర్ణలత, విజయ, పద్మమ్మ, సుహాసిని, అపర్ణ, రాజేశ్వరి, కళ్యాణీ, సుకుమారి, కోటమ్మ, సరస్వతీ, ప్రమీల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న ముస్లిం దంపతులు

మిట్టమీద గంగమ్మ తల్లికి వెండి దీపాల సమర్పణ

చంద్రగిరి, మేజర్‌న్యూస్: చంద్రగిరి పట్టణం కొత్తపేట భారతీనగర్‌కు చెందిన అబ్దుల్ రజాక్, రజియా దంపతులు ఈ ఏడాది జనవరిలో జరిగిన అమ్మవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు. ఆ సమయంలో తమకు ఉన్న ఒక వ్యక్తిగత కోరిక నెరవేరాలని గంగమ్మ తల్లిని భక్తితో వేడుకున్నారు. తాము మొక్కుకున్న విధంగానే అనుకున్న కార్యం దిగ్విజయంగా పూర్తి కావడంతో, ఈ దంపతులు శుక్రవారం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కులో భాగంగా 223 గ్రాముల బరువు కలిగిన వెండి దీపాలను తయారు చేయించి, వాటిని ఆలయ అర్చకులు సుబ్బు స్వామికి అందజేశారు. అబ్దుల్ రజాక్, రజియా దంపతులు అమ్మవారిపై ఉన్న అచంచలమైన నమ్మకంతోనే తాము మొక్కుకున్నామని, కోరిక నెరవేరడంతో కృతజ్ఞతగా ఈ కానుకను సమర్పించామని సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారిపై అచంచలమైన విశ్వాసంతో దంపతులు ఈ విరాళాన్ని అందజేయడం అభినందనీయమని కొనియాడారు. పూజా కార్యక్రమాల అనంతరం అబ్దుల్ రజాక్, రజియా దంపతులకు ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలు అందజేసి, ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

నారా లోకేష్ ప్రజా ప్రతినిధులతో భేటీ.. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి బాటలు

తెలుగుదేశం యువనేత నాగమల్లి దుర్గాప్రసాద్

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ యువ నేత, పట్టణాభివృద్ధి శాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి బాటలు వేస్తున్నదని శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నేత నాగమల్లి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియోజకవర్గాలు వారి ప్రజా ప్రతినిధులతో చర్చించడం, స్థానిక సమస్యలు తెలుసుకోవడం, కుటుంబ సభ్యులతో మాట్లాడడం, కలిసి సంపత్తి భోజనాలు చేయడం చెప్పుకోదగ్గ పరిణామం అని తెలిపారు. రాష్ట్రంలో గత వైయస్సార్ పార్టీలో పరిణామాలు పరిశీలన చేస్తే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులకు ఐదు సంవత్సరాల్లో కూడా అపాయింట్మెంట్ ఇచ్చిన దాఖలు లేవని తెలిపారు. నారా లోకేష్ బాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కంకణ బద్ధులై పని చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాలు వారికి ప్రజా ప్రతినిధులతో చర్చించడం తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతానికి కృషి చేస్తుందని తెలిపారు.

నేడు డీవీఎంసీ సమావేశం

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం

చిత్తూరు ప్రతినిధి మేజర్‌న్యూస్: పౌర హక్కుల రక్షణ చట్టం అమలుపై శని వారం జిల్లా నిఘా పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సీ సంక్షేమ, సాధికారత జిల్లా ఇన్ఛార్జి అధికారి రబ్బానీబాషా శుక్రవారం ప్రకటనలో పేర్కొ న్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి డీవీ ఎంసీ సభ్యులందరూ హాజరు కావాలని తెలిపారు.

సాయిబాబా ఆలయంలో విశేష పూజలు

వాకాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన వాకాడు సాయిబాబా ఆలయంలో గత రెండు రోజులుగాకామ్యపురం దత్త పీఠాధిపతి శ్రీ అనఘానంద భారతి స్వాములవారిచే విశేష పూజలు, ప్రవచనాలు జరుగుత ఎన్నాయి. శుక్రవారం ఆలయ ధర్మకర్త విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మండలంలోని పలు ప్రాంతాల నుంచి సాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో పూజలు, అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. అనంతరం అలఘానంద భారతి స్వామిచే గురువు విశిష్టతపై భోధను వివరించడం జరిగింది. రాత్రి సాయి భక్తులు భజనలు, పల్లకీ సేవ నిర్వహించారు.

జిఓ నెం 21ని రద్దు చేయాలి : సిఐటియు డిమాండ్

గూడూరు, మేజర్‌న్యూస్: జిఓ నెంబర్ 21ని తీసుకువచ్చి ఆటో డ్రైవర్లపై అధిక పెనాల్టీలు వేస్తున్నారని, వెంటనే రద్దు చేయాలని ఆటోకార్మిక సంఘంనాయకులు బివి రమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరు సిఐటియు ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఓలా, ఉబర్, రాపిడో, యాప్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. సిఐటియు జిల్లా కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ పాద యాత్రలో మేము అధికారంలోకి వస్తే, ఆటో కార్మికుల కడుపు కొట్టే జిఓ నెంబర్ 21న రద్దు చేస్తామని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని పలు హామీలు ఇవ్వడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ కార్య రూపం దాల్చలేదన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే ఏదైనా ప్రమాదం జరిగితే సంక్షేమ బోర్డు ఆ కుటుంబాలన్ని, పిల్లల చదువులకు, ఆదు కోవడమే కాకుండా వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందని, వెంటనే సంక్షేమ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "అవినీతికి అడ్డాగా" మారిన (ఎటిసి) సెంటర్ ను రద్దు చేయాలని,(ఏ.టి.సి) సెంటర్లను రవాణాశాఖ అధికారుల "పర్యవేక్షణలో నిర్వహించాలని" ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ మార్కెట్ సెంటర్ స్టాండ్ అధ్యక్షులు బి రమేష్, తిక్కవరం, చింతవరం స్టాండ్ల, కమిటీ సభ్యులు ఏ శ్రీనాథ్, ఐ.పెంచలయ్య, సిహెచ్ శ్రీకాంత్, విందూరు స్టాండ్ అధ్యక్షులు వి భాస్కర రెడ్డి, పి శివ, ఎస్‌డి మస్తాన్, ఎన్ కోటయ్య, ఓజిలి స్టాండ్ అధ్యక్షులు ఎస్‌కె మహబూబ్ బాషా, కల్లూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన వారోత్సవాల్లో బిందుశ్రీకి తృతీయ బహుమతి

కుప్పం, మేజర్‌న్యూస్: చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞాన వారోత్సవాల పోటీలలో గుడుపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని బిందుశ్రీ ప్రతిభ కనబరచి తృతీయ బహుమతి సాధించింది.గుడుపల్లి మండలానికి చెందిన ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బిందుశ్రీ పోటీల్లో పాల్గొని, తన ప్రతిభతో జడ్జీలను ఆకట్టుకుని 3వ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొ నడం వల్ల వారి ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. బిందుశ్రీ సాధించిన ఈ విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థి తల్లిదండ్రులు కూడా బిందుశ్రీని అభినందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బిందుశ్రీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సి.ఐ.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు

గూడూరు, మేజర్‌న్యూస్: మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం గూడూరు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట మున్సిపల్ మహిళా కార్మికులు, రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.ఐ.టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కటారి అజయ్ కుమార్ పాల్గొనడం జరిగింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో భాగంగా నిర్వహించిన నిరసనలో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగింపు లోనైనా మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా ఉద్యోగాలు పర్మినెంట్, ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీ.వో ఆర్.టి.సి నెంబర్ 1615 ప్రకారం పిఆర్‌సి జీతాలు చెల్లింపు, కరువు బత్యం, మధ్యంతరభృతి, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు, పదవి విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్,గ్రాడ్యుటి, పిల్లలకు ఉద్యోగాలు, కార్మికులకు సంక్షేమ పథకాలు, ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్, డైలీవేజ్,ఎం-బుక్, అడిషనల్ వర్కర్స్, క్లాఫ్ డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం, తదితర డిమాండ్ల పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రాష్ట్ర నాయకులు ధారా కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్ఎం సునీల్ కుమార్, మహిళ నాయకులు, కార్మికులు కె పెంచలమ్మ, డి మణెమ్మ, జి మేరీ, ఎం జయమ్మ, పి పెంచలమ్మ, ఎన్ వెంకటరమణ, గూడూరు పట్టణ సిఐటియు ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.